బుధవారం
27-8-2025

హైదరాబాద్ ప్రచురణ

సంపుటి : 09, సంచిక : 337
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం



వైష్ణోదేవి మార్గంలో ఐదుగురి మృతి

జమ్మూ: శ్రీవైష్ణోదేవి మందిరానికి వెళ్లే మార్గంలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. అర్ధ్‌కువారి వద్ద ఇంద్రప్రస్థ భోజనాలయ సమీపంలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మరణించగా, మరో 14 మంది గాయపడ్డారు. రెండు మృతదేహాలను స్వాధీనం చేసుకుని కాత్రా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కొందరికి వైద్యచికిత్స అందిస్తున్నారు. శ్రీమాతా వైష్ణోదేవి ఆలయ బోర్డు సమన్వయంతో అత్యవసర సహాయ బృందాలు తక్షణ సహాయ చర్యలు చేపట్టాయి. సోమవారం రాత్రి భారీ వర్షాలు కురియడంతో ఆలయ బోర్డు ముందుజాగ్రత్త చర్యగా వైష్ణోదేవి యాత్రను

- మిగతా 2 లో

గవర్నర్లకు ఆ అధికారం ఉందా?

బిల్లుల నిలుపుదలపై కేంద్రానికి సుప్రీం ప్రశ్న

అసంపూర్తిగా వాదనలు- 28న తదుపరి విచారణ

న్యూఢిల్లీ: ఆమోదం కోసం వచ్చిన బిల్లులను నిలిపివేసేందుకు గవర్నర్‌కున్న అధికారం మనీ బిల్లులకూ వర్తిస్తుందా అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అటువంటి బిల్లులను ఆలస్యం చేయడానికి లేదా నిరవధికంగా నిలిపివేయడానికి అనుమతి ఉందా అని కూడా అడిగింది. రాష్ట్రపతికి సిఫార్సుల వ్యవహారంలో సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్,

- మిగతా 2 లో



భూభారతితో సాదాబైనామాల పరిష్కారం

- తొలగిన కోర్టు స్టే... దరఖాస్తులకు త్వరలో మోక్షం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: భూభారతి చట్టం ద్వారా సాదా బైనామాల దరఖాస్తులకు పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సాదాబైనామాలపై ఉన్న స్టేను రాష్ట్ర హైకోర్టు మంగళవారం తొలగించిందని, ఈ తీర్పు లక్షలాది మంది పేద ప్రజల కలలను సాకారం చేస్తుందన్నారు. సాదా బైనామాల విషయంలో గత ప్రభుత్వం పేద ప్రజలను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించారే గానీ 2020 ఆర్‌ఓఆర్ చట్టంలో ఈ దరఖాస్తుల పరిష్కారానికి మార్గం చూపించలేదని, ఫలితంగా 9.26 లక్షల దరఖాస్తులు పరిష్కారం కాకుండాపోయాయని, దీనిపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. సాదా బైనామాల దరఖాస్తులను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలన్న ఆలోచనతో తమ ప్రభుత్వం నిరంతరం హైకోర్టులో కేసుకు ముగింపు లభించేలా కృషి చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఈ సమస్యకు పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం భూభారతి చట్టంలో స్పష్టమైన నిబంధనలను పొందుపరిచిందని వివరించారు. సాదా బైనామాల దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన గ్రౌండ్ వర్క్ పూర్తి చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం అక్రమంగా తీసుకువచ్చిన ధరణి

- మిగతా 2 లో

సీఎం వినాయకచవితి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని ప్రార్థించారు. వాడ వాడల వెలిసే గణేష్ మండపాలలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని కోరారు. గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సంవత్సరం కూడా వినాయకుని మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నదని చెప్పారు.

మట్టి వినాయకులతో పర్యావరణం కాపాడుకుందాం: భట్టి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఏర్పడే సకల విఘ్నాలను వినాయకుడు తొలగించాలని ప్రార్థించారు. మన అందరం ఇళ్లల్లో, ప్రతి మండపంలో మట్టి వినాయకులను పెట్టి పూజించి మన సంస్కృతిని, పర్యావరణాన్ని కాపాడుకుందామని అన్నారు. ఊరూరూరా వెలసిన వినాయక మండపాలకు ఈ ఏడాది ప్రజా ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోందని చెప్పారు. వినాయక మండప నిర్వాహకులందరూ అధికారులు సూచించిన భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

దేశంలో ఎక్కడా లేని భూసమస్యలు తెలంగాణలోనే

హైకోర్టు

విశాలాంధ్ర- హైదరాబాద్: రంగారెడ్డిజిల్లా మహేశ్వరం మండలం నాగారంలో భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ మంగళవారం విచారణ జరిగింది. నాగారంలోని సర్వే నెంబర్ 194, 195లో 754 ఎకరాల భూమి ఉందని ప్రభుత్వ న్యాయవాది

- మిగతా 2 లో

పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముమ్మరం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 28న పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈనెల 29న జిల్లా స్థాయి, 30న మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈనెల 28 నుంచి 30 వరకు అభ్యంతరాలను స్వీకరించి.. సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితాను విడుదల ప్రకటిస్తామని ఎన్నికల సంఘం పేర్కొంది.



అల్పపీడనం... భారీ వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మళ్లీ అల్పపీడనం ఏర్పడనుంది. ఒడిశా తీరానికి ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే 2 రోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదిలి మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో బుధవారం ఉత్తరాంధ్రలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి గంటకు 40-60 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న రెండు రోజులు వాతావరణం క్రింది

- మిగతా 2 లో

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: మట్టి విగ్రహాలతో వినాయకచవితి పండుగ జరుపుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణ చేసిన వాళ్లమవుతామని... రాబోయే తరాల కోసం ఈ బాధ్యత మన అందరిపై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ అధ్వర్యంలో వివిధ సెంటర్లలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలతోనే పండుగ జరుపుకోవాలని అభ్యర్థించారు. కెమికల్స్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణం పై తీవ్ర కాలుష్య ప్రభావం ఏర్పడుతుందని శాస్త్రజ్ఞులు సైతం చెప్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికే అనేక కారణాలు మానవ తప్పిదాల వల్ల మన పర్యావరణం చాలా దెబ్బతిందని వివరించారు. ఇటీవల ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల చొరవతో ప్రజల్లో అవగాహన పెరుగుతోందన్నారు. ఈ పరిణామంపై స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. మరింత ప్రచారం కల్పించడం ద్వారా మట్టివిగ్రహాల ఏర్పాటును విస్తృతం చేయాలని కోరారు. కాలుష్యం పెరగడంతో వాతావరణంలో సమతుల్యత లోపించి ఈ మధ్యకాలంలో ఊహించని అనేక ఉపద్రవాలు సంభవిస్తున్నాయని కూనంనేని వెల్లడించారు. కాలుష్య నివారణ ప్రతిఒక్కరీ బాధ్యత అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధ్వర్యంలో మూడువేల మట్టివిగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో గణేశ్ మంటపాల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అవాంఛనీయ సంఘటనలో చోటుచేసుకోకుండా పోలిసు శాఖ కఠినంగా వ్యవహరించాలని సూచించారు. వినాయకచవితి పండుగ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, అధికారులు అహ్మద్, వీరభద్రా చారి, రంగ ప్రసాద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు ఎండీ యూసుఫ్, ఎస్కే ఫహీమ్, గెద్దాడు నగేశ్, కేశవరావు, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణాచారి, దుర్గ, సతీశ్‌బాబు, నర్సింహా, అజీజ్, నీడల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం

కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే ఆస్పత్రి

- మిగతా 2 లో

ఇండియాపై అమిత్‌షా అక్కసు

చాడ వెంకటరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన తమ అభ్యర్థిని నిలబెట్టడాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జీర్ణించుకోలేకపోతున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. అమిత్ షా గుజరాత్ హోంమంత్రిగా ఉన్నప్పుడు సొరబ్ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తీర్పుతో రెండేళ్లు ఆ రాష్ట్రానికి దూరమయ్యారని, అందుకు ఇప్పుడు అక్కసు వెళ్లగక్కుతున్నారని వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రిగా ఆయన న్యాయ వ్యవస్థను కళంకలితం చేస్తున్నారని చాడ వెంకటరెడ్డి దుయ్యబట్టారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉప రాష్ట్రపతి అయితే మావోయిస్టులు 20ఏళ్లు ముందుకెళ్తారన్న అమిత్ షా వైఖరి తగదన్నారు. మావోయిస్టులు లేకుండా చేయడమంటే ప్రజాస్వామ్య మూల సూత్రాలకు విఘాతం కలిగించడమే అవుతుందని చాడ వెల్లడించారు. ప్రశ్నించే గొంతులను

- మిగతా 2 లో



ప్రజా సమస్యలపై ఉద్యమాలు ఉధృతం

- ప్రభుత్వం 'సూపర్ సిక్స్' అమలు చేయాలి
- బ్లాక్ మార్కెట్లో ఎరువులు... చోద్యం చూస్తున్న డబుల్ ఇంజన్ సర్కారు
- సీపీఐ జాతీయ మహాసభల అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక
- రాష్ట్ర మహాసభలు విజయవంతం... అందరికీ ధన్యవాదాలు
- మీడియా సమావేశంలో సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- రాష్ట్ర మహాసభలు ఆమోదించిన 62 తీర్మానాలు విడుదల

విశాలాంధ్ర-ఒంగోలు: రానున్న కాలంలో పేదల పక్షాన మరిన్ని ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు. సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు విజయవంతమైన సందర్భంగా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో మంగళవారం పార్టీ జిల్లా సమితి ఆధ్వర్యాన నిర్వహించిన మీడియా సమావేశంలో రామకృష్ణ

- మిగతా 2 లో

రైతులు ఇక్కడ... సీఎం, మంత్రులు ఎక్కడ

విశాలాంధ్ర-హైదరాబాద్: యూరియా కోసం తెలంగాణ రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులకు పట్టడం లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర సమస్యలను గాలికొదిలేసి ఢిల్లీ, బీహార్‌లో తిరుగుతున్నారని మండిపడ్డారు. జాతీయ రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని ఎక్స్ మాధ్యమంగా ప్రశ్నించారు. 'రైతులు ఇక్కడ, సీఎం, మంత్రులు ఎక్కడ' అంటూ ఎద్దేవా చేశారు. 'సమస్యలు ఇక్కడ... సీఎం, మంత్రులు ఢిల్లీ, బీహార్‌లోనా!' అని విమర్శించారు. యూరియా కోసం రైతుల పాట్లు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పట్టాయన్నారు. 'రైతులు యూరియా కోసం తండ్లాడుతుంటే, మీరు ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడికి ఎగిరిపోతారా! జాతీయ పార్టీలకు ఓట్లు, రాష్ట్ర ప్రజలకు పాట్లా!' అని మండిపడ్డారు. యూరియా సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్, బీజేపీ విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి, జాతీయ పార్టీల నిర్లక్ష్యాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, ప్రశ్నిస్తున్నారని కేటీఆర్ హెచ్చరించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇదీ లోకం!

లిథువేనియా ప్రధానిగా కార్మిక నాయకురాలు

దేశ పగ్గాలు చేపట్టిన ఇంగా రుగినియెన్

విల్నియస్: లిథువేనియా దేశానికి కొత్త ప్రధానిగా ఇంగా రుగినియెన్ మంగళవారం ఎన్నికయ్యారు. ఆమె ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ మాజీ చైర్‌పర్సన్. గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు సెంటర్ లెఫ్ట్ సోషల్ డెమొక్రటిక్ పార్టీలో చేరారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన కార్మిక నాయకురాలికి దేశ పగ్గాలు కట్టబెట్టేందుకు శాసనసభులు ఆమోదం తెలిపారు. వ్యాపార కార్యకలాపాల్లో అవకతవకలకు సంబంధించి విచారణ క్రమంలో గింటౌటస్ పలుకాస్ రాజీనామా చేశారు. అనంతరం ఇంగా రుగినియెస్ ఈ పదవీ బాధ్యతలు చేపట్టారు. కొత్త ప్రధానిగా రుగినియెస్ పేరును అధ్యక్షులు గిటానస్ నౌసెదా ప్రతిపాదించారు. పార్లమెంటులో ఓటింగ్ అనంతరం నూతన ప్రధానిగా రుగినియెస్ పగ్గాలు చేపట్టారు. సభలో మాట్లాడుతూ సుస్థిరతను పునరుద్ధరిస్తానని సంకల్పించారు. ఓటర్లు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే ప్రభుత్వం పనిచేస్తుందని హామీనిచ్చారు. ఇంగా రుగినియెన్ 2018 నుంచి 2024 వరకు లిథువేనియన్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ చైర్ పర్సన్‌గా ఉన్నారు. 2023-24లో యూరోపియన్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు.12 డిసెంబర్ 2024 నుంచి లిథువేనియా సామాజిక భద్రత-కార్మిక శాఖ మంత్రిగా వ్యవహరించారు. గింటౌటాస్ పలుకాస్ రాజీనామా తర్వాత ప్రధాన మంత్రి అభ్యర్థిగా రుగినియెన్‌ను సోషల్ డెమోక్రాట్లు నామినేట్ చేశారు. ఆమెను నూతన ప్రధానిగా అధ్యక్షుడు ప్రతిపాదించగా, చట్టసభ ఆమోదించింది. దీంతో ఆమె ప్రమాణ స్వీకారంచేశారు.

ఇజ్రాయిల్‌తో తెగతెంపులు

- గ్రీస్ ప్రజల డిమాండ్
- భారీ ర్యాలీలు
- కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంఘాల మద్దతు

ఏథెన్స్: ఇజ్రాయిల్‌తో సంబంధాలు తెంచుకోవాలన్న డిమాండ్ గ్రీస్ అంతటా మార్మోగింది. గాజాలో ఇజ్రాయిల్ దురాక్రమణను నిలిపివేయాలంటూ గ్రీస్ ప్రజలు ఒక్కటయ్యారు. మారణహోమాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఇజ్రాయిల్‌తో పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలని గ్రీస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలస్తీనాకు విముక్తి కల్పించాలని, అన్ని కారిడార్లు తక్షణమే తెరవాలని, పలస్తీనియన్లకు సహాయం అందేలా చూడాలని నినాదాలు చేస్తున్నారు. పలస్తీనాకు మద్దతుగా వేలాది మంది వీధుల్లోకి వచ్చి భారీస్థాయిలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. గ్రీస్‌లోని ప్రధాన నగరాల్లో ర్యాలీలు జరిగాయి. పలస్తీనాకు అనుకూలంగా, ఇజ్రాయిల్‌కు, గ్రీస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. కార్మిక సంఘాలతో పాటు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) సంపూర్ణ మద్దతిచ్చింది. 'పలస్తీనా ప్రజలను పస్తులు ఉంచి చంపేస్తున్నారు... వారి భూభాగంలోకి వెళ్లి మారణహోమం సృష్టిస్తున్నారు. ఇటువంటి యుద్ధ నేరస్తుడికి గ్రీస్ ప్రభుత్వం మద్దతు ఇస్తుండటం ఆమోదయోగ్యం కాదు. ఇదంతా తక్షణమే ఆగిపోవాలి. హంతక దేశంతో అన్ని సంబంధాలు తెంచుకోవాలి' అని ఏథెన్స్ ర్యాలీలో పాల్గొన్న కేకేఈ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌట్సోంబస్ ఉద్ఘాటించారు. ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పీఏఎంఈ) కూడా వ్యతిరేక గళం వినిపించింది. యూరోపియన్ దేశాలు, అమెరికా, నాటో కలిసి ఇజ్రాయిల్‌కు మద్దతివ్వడాన్ని తీవ్రంగా ఖండించింది. వేలాది మంది మహిళలు, పిల్లల ఊచకోతకు సహకారాన్ని ఆక్షేపించింది. పలస్తీనాకు సంఘీభావం ప్రకటించింది. పలస్తీనాకు మద్దతివ్వడం నేరమన్నట్లుగా యూరప్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. 'ఐడీఎఫ్ హంతకులకు గ్రీస్ పోర్టులో అడుగు పెట్టనివ్వం... కార్మిక నగరంలో కాలు మోపనివ్వం' అంటూ పీఏఎంఈ ప్రకటించింది. అమాయక పిల్లలు, గాజా పౌరులను హతమార్చే యుద్ధ నేరస్తులకు పర్యాటక ప్రాంతంగా గ్రీస్‌ను మారనివ్వబోమని సంకల్పించింది. తమ ప్రాణాలు కాపాడుకోవడం కోసం, న్యాయం, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న పలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతున్నామని నిర్మాణ కార్మికుల సమాఖ్య నాయకుడు వాల్సమోస్ సిరిగోస్ ఉద్ఘాటించారు. సంకల్పముంటే ఏది అసాధ్యం కాదని పలస్తీనా ప్రజలు గత రెండేళ్లుగా నిరూపిస్తున్నారన్నారు. కాళ్లకు చెప్పులు లేకపోయినాగానీ ప్రపంచంలోనే అత్యంత కిరాతక యుద్ధ యంత్రాన్ని ఎదుర్కోగలమని, మాతృభూమిని పరిరక్షించుకోవడం కోసం పోరాడగలమని రుజువు చేస్తున్నారని సిరిగోస్ వెల్లడించారు.

త్వరలో కిమ్‌తో ట్రంప్ భేటీ!

వాషింగ్టన్/సియోల్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌తో ఈ ఏడాది భేటీ కావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్షించారు. దక్షిణ కొరియాతో వాణిజ్య చర్చలకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. దక్షిణ కొరియా నూతన అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ అమెరికాలో పర్యటించారు. శ్వేతసౌధంలో ట్రంప్ ఆయనకు స్వాగతం పలికారు. ఇద్దరు అధినేతలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పరస్పరం మరింతగా సహకరించుకోవాలని నిర్ణయించారు. అనంతరం ఓవల్ కార్యాలయంలో విలేకరులతో సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ 'సమీప భవిష్యత్‌లో పరిస్థితులు అనుకూలంగా సమయంలో కిమ్ జాంగ్ ఉన్‌తో సమావేశం కోసం ఎదురు చూస్తున్నా' అని అన్నారు. ట్రంప్‌ను శాంతి దూతగా లీ జే మ్యూంగ్ ప్రశంసించారు. నౌకల నిర్మాణంతో పాటు ఇతర తయారీ రంగాల్లో అమెరికాతో సహకారాన్ని మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమెరికా సీనియర్ అధికారులతో కలిసి ఆయన బిజినెస్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ సదస్సులో 20కుపైగా అమెరికా కంపెనీలు, దక్షిణ కొరియా కంపెనీలకు చెందిన సీఈఓలు, అధికార ప్రతినిధులు హాజరయ్యారు. ఇదిలావుంటే, తమ అధినేతతో భేటీని ట్రంప్ కోరడంపై ఉత్తర కొరియా స్పందించలేదు. అయితే దక్షిణ కొరియాతో కలిసి అమెరికా సైనిక విన్యాసాలు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండించింది. కొరియా ద్వీపకల్పాన్ని ఆక్రమించుకోనే ప్రయత్నంగా దుయ్యబట్టింది. ఆ ప్రాంత దేశాలను లక్ష్యంగా చేసుకోవడమే అమెరికా ఉద్దేశంగా పేర్కొంది.

'డిజిటల్ పన్ను' దేశాలపై అదనపు సుంకాలు: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పేరిట రోజుకో ప్రకటన చేస్తున్నారు. డిజిటల్ పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వకపోతే ఆయా దేశాల ఎగుమతి వస్తువులపై అదనపు సుంకాలు విధిస్తామని హెచ్చరించారు.

డిజిటల్ సర్వీసెస్ యాక్ట్ అమలు కోసం బాధ్యగల యూరోపియన్ యూనియన్ లేక సభ్య దేశాలపై ఆంక్షలు విధించే యోచనలో ట్రంప్ యంత్రాంగం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించారు. ఆల్ఫబెట్ గూగుల్, మెటా ఫేస్‌బుక్, యాపిల్, అమేజాన్ వంటి డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల అమ్మకాల సంబంధిత ఆదాయంపై అనేక దేశాలు ముఖ్యంగా యూరప్ పన్నులు విధించాయి. ఇది అమెరికా యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. 'ఇలాంటి వివక్షపూరిత చర్యలను ఆపకపోతే ఆ దేశాల నుంచి అమెరికాకు జరిగే ఎగుమతులపై గణనీయమైన అదనపు సుంకాలను విధిస్తామని డిజిటల్ పన్నులు, శాసనాలు, నియమ నిబంధనలు అమలు చేసే దేశాలకు తేల్చిచెబుతున్నా' అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ వెల్లడించారు. అమెరికా సాంకేతికతను దెబ్బతీసే ఉద్దేశంతోనే ఇటువంటి వివక్షపూరిత చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు.

4న ఏపీ మంత్రివర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వచ్చే నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్ లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి తీసుకువెళ్లాల్సిన ప్రతిపాదనలను సెప్టెంబర్ 2వ తేదీ సాయంత్రం 4 గంటలకల్లా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం)కు పంపాల్సిందిగా అన్ని శాఖలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలి చ్చారు. రాజధాని ప్రాంతంలో వివిధ సంస్థల ఏర్పాటుకు సంబంధించి భూ కేటాయింపులతో పాటు, పాలనాపరమైన అంశాలకు సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సెప్టెంబరులో నిర్వహించే అవకాశమున్నందున, సభలో ప్రవేశపెట్టాల్సిన బిల్లులు, వివిధ శాఖలకు సంబంధించి తీసుకురావల్సిన చట్ట సవరణలు కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంగణాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆస్పత్రి పరిసరాల అపరిశుభ్రత, ఆస్పత్రి నిర్వహణ అధ్వానంగా ఉండటం పై మండిపడ్డారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని గతంలో అనేకమార్లు హెచ్చరించినప్పటికీ మార్పు రాకపోవడంపై వైద్యులపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పద్ధతి మార్చుకోవాలంటూ హెచ్చరించారు. సిబ్బంది నిర్లక్ష్య పనితీరు, ప్రవర్తన వల్ల చెడ్డపేరు వస్తుందన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయే పరిస్థితి తీసుకురావడం బాధాకరమన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చిన్న చిన్న కేసులను ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులను వేరే ప్రదేశాలకు రిఫర్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఇక్కడి వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్యం అందించాలి కదా అన్నారు. వైద్య సిబ్బంది, మందులు, వైద్యపరికరాల కొరత లేనప్పుడు ఎందుకు రిఫర్ చేస్తున్నారని నిలదీశారు. వైద్యవృత్తికి కట్టుబడి సేవాదృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఇలాంటి పరిస్థితుల వల్లే వైద్య అభివృద్ధికి కళంకం వస్తుందన్నారు. మొక్కుబడిగా ఉద్యోగాలు చేస్తామంటే చర్యలు తప్పవన్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకొని మానవత దృష్టితో పనిచేయాలని సూచించారు.

భూభారతితో సాదాబైనామాల పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

పోర్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బంగాళాఖాతంలో కలిపేశామని, దేశంలోని 18 రాష్ట్రాలలో అధ్యయనం చేసి భూభారతి-2025 చట్టాన్ని రూపొందించామన్నారు. రోల్ మోడల్‌గా నిలిచిన ఈ భూభారతి చట్టం మేరకు రైతన్నల, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపించే తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తోందన్నారు.

'ఇండియా'పై అమిత్‌షా అక్కసు

(మొదటిపేజీ తరువాయి)

నొక్కేస్తున్నారని, 100 శాతం దివ్యాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాను తొమ్మిదేళ్లు జైల్లో ఉండి... చనిపోయారని, సుప్రీంకోర్టు కూడా సాయిబాబా నిర్దోషి అని తీర్పు ఇచ్చిందని, అమిత్ షాకు అది చెంప పెట్టు అని చాడ వెంకటరెడ్డి అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని దేశంలోని న్యాయమూర్తులు అభినందిస్తున్నారన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుడ్డిగా ఎన్డీయేకు మద్దతు ఇవ్వరాదని, వారు ఆలోచించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసిరావాలని చాడ వెంకటరెడ్డి సూచించారు.

అల్పపీడనం... భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

విధంగా ఉండనుంది. బుధవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడనున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడనున్నాయి. గురువారం కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడనున్నాయి. మంగళవారం సాయంత్రం 6 గంటల నాటికి సాలవువానిపాలెంలో 60.2 మిమీ, శ్రీకాకుళంలో 58 మి.మీ, విశాఖ జిల్లా నాతయ్యపాలెంలో 55.7 మి.మీ అనకాపల్లి జిల్లా గంధవరంలో 55.5 మిమీ, లంకేలపాలెంలో 55.2 మిమీ, విజయనగరం అర్బన్ 54.7 మిమీ చొప్పున వర్షపాతం, 65 ప్రాంతాల్లో 40 మిమీకు పైగా వర్షపాతం నమోదయింది.

పారిశ్రామిక వేత్తలుగా లక్షమంది మహిళలు

- ఈ లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి
- ఎస్ఎల్బీసీ సమావేశంలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త విధానంలో భాగంగా వచ్చే ఏడాది మార్చి 8వ తేదీన జరగబోయే మహిళా దినోత్సవం నాటికి లక్ష మంది పారిశ్రామిక వేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, దీనికి బ్యాంకర్లు పూర్తిగా సహకరించాలని సీఎం చంద్ర బాబు నాయుడు కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో 232వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, డ్వాక్రా గ్రూపులకు రుణ వితరణ లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే ఏయే రంగాల్లో సహకారం కావాలనే అంశాన్ని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్యాంకులు అందించే సహకారాన్ని అందుకుని ఏపీ డ్వాక్రా మహిళలు ప్రగతి పథాన నడుస్తున్నారు. ఇప్పటికే మహిళలు వివిధ రంగాల్లో వ్యాపారాలు చేస్తున్నారు. స్వయం ఉపాధి పొందుతున్నారు. వారికి మరింత తోడ్పాటు ఇచ్చే విధంగా వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ పెన్యూయర్ విధానాన్ని వారికి వర్తింప చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో భాగంగా 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. వీటిల్లో వీలైనంత మేరకు మహిళలకు అవకాశం ఇస్తాం. డ్వాక్రా మహిళలకు బ్యాంకర్లు ఏ విధంగా సహకరించారో.. దీనికి కూడా బ్యాంకర్లు సహకరించాలని చంద్రబాబు కోరారు.

ఇన్నోవేషన్ కేంద్రాలకు... బ్యాంకర్లు అనుసంధానమవ్వాలి

యువత, మహిళ పారిశ్రామిక వేత్తలను ప్రొత్సహించేలా రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించాం. ఇప్పటికే అమరావతిలో ప్రధాన కేంద్రం పనిచేయడం మొదలైంది. విశాఖ, రాజమండ్రి, విజయవాడ, అనంతపురం, తిరుపతి వంటి చోట్ల ఐదు ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే వీరికి నాలెడ్జ్, ఎడ్యుకేషన్ పార్టనర్లు ఉంటారు. దీనికి బ్యాంకర్ల నుంచి సహకారం ఉండాలి. ఫలితాలు వచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. ఐదు ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోయే ఇన్నోవేషన్ హబ్ లకు ఆయా ప్రాంతాల్లో ఉండే బ్యాంకుల ప్రతినిధులను అనుసంధానించాలి. ఇది స్టార్టప్ లకు, నైపుణ్యాభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. బ్యాంకర్లు తక్కువ వడ్డీలతో రుణాలివ్వడం.. తక్కువ మొత్తాలతో అప్పు తీర్చే వెసులుబాటు కలిగించాల్సిన అవసరం ఉంది. బ్యాంకర్ల సమావేశాలు అర్థవంతంగా జరగాలి. రొటీన్ సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. ఖరీఫ్ సీజన్లో ఇప్పటికే సగం సమయం గడిచిపోయింది. ఈ పాటికే రైతులకు రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వటం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదు. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజల్ని నియంత్రించేలా కాకుండా... ప్రొత్సహించేలా ఉండాలని సీఎం మార్గనిర్దేశనం చేశారు. అమరావతిలో బ్యాంకులు తమ ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవాలని, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ను ఏర్పాటు చేసి క్వాంటం వ్యాలీ సేవల్ని వినియోగించుకోవాలని చంద్రబాబు సూచించారు. అమరావతిలో బ్యాంకులకు అవసరమైన భూమిని కేటాయిస్తామన్నారు. రెండేళ్లలో తమ కార్యాలయాలను నిర్మించాలన్నారు. అమరావతి రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలని చెప్పారు. కౌలు రైతులకు రుణాలివ్వాలని, బడుగులకు ప్రభుత్వం అండగా ఉండడంతోపాటు.. బ్యాంకర్లు కూడా సహకరించాలని కోరారు.

కౌలు రైతులకు రూ.985 కోట్లు

మొత్తంగా వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా అన్ని రంగాలకు కలిపి రూ. 2,47,919 కోట్ల మేర రుణాలను బ్యాంకులు ఇచ్చాయి. ఇందులో వ్యసాయ రంగానికి రూ.94,666 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.49,831 కోట్లు, ఇతర రంగాలకు రూ. 1,00,278 కోట్ల మేర రుణాలను ఇచ్చారు. దీంట్లో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్ల రుణాల్ని మంజూరు చేశారని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు చెప్పారు. మచిలీపట్నంలో ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో పార్కు, మెమోరియల్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వం రెండెకరాల భూమి కేటాయించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఎస్ఎల్బీసీ ఛైర్మన్ నితీష్ రంజన్, సీడ్బీ సీఎండీ మనోజ్ మిట్టల్, ఎగ్జిమ్ బ్యాంక్ ఎండీ హర్ష బంగారి, కెనరా బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు, పంజాబ్ నేషనల్ ఎండీ అశోక్ చంద్ర, ఇండియన్ బ్యాంక్ ఎండీ బినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమాలు ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై 62 తీర్మానాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ 62 తీర్మానాలను రాష్ట్ర మహాసభల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. రానున్న కాలంలో ఆయా సమస్యలపై పోరాటాలు మరింత ఉధృతం చేసి ప్రజల పక్షాన నిలుస్తామని పేర్కొన్నారు. 32 మంది బలిదానంతో తెలుగు ప్రజల సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర మహాసభలలో ఆమోదించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పేదలకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు వంతున నివేశిత స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చేంతవరకు పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని విమర్శలు చేశారన్నారు. జగన్ ప్రభుత్వం చేసుకున్న సోలార్ అగ్రిమెంట్ కారణంగా 25 ఏళ్ల పాటు రాష్ట్రంలోని పేదలపై రూ. ఒక లక్ష పదివేల కోట్లు భారం పడుతుందని తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు అదే అగ్రిమెంట్‌ను అనుసరిస్తూ పేదలపై విద్యుత్ భారాలు మోపుతున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా వ్యతిరేకంగా ఈనెల 28వ తేదీన కలిసిపోచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ప్రజా ఉద్యమం నిర్మిస్తామని హెచ్చరించారు. సుపరిపాలన, డబుల్ ఇంజన్ సర్కార్ అని పేర్కొంటున్న కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్లో ఎరువులను సక్రమంగా అందించడంలో విఫలం అయిందని రామకృష్ణ విమర్శించారు. ఒకవైపు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు 31 లక్షల 15 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని, ప్రస్తుతం రాష్ట్రంలో 21 లక్షల 34,3ల ఎరువులే ఉన్నాయని, మిగిలిన వాటిని కోసం కూడా ఇండెంట్ పెట్టామని ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఎరువులు అంత సమృద్ధిగా ఉన్నట్లయితే... నేడు బ్లాక్ మార్కెట్లో 250 రూపాయల బస్తా యూరియా రూ. 500 ఎందుకు పలుకుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు వేకువజామునే వచ్చి లైన్లో నిలబడుతున్నప్పటికీ కనీసం బ్లాక్ మార్కెట్లో కూడా ఎరువులు దొరకట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా స్మార్ట్ ప్రభుత్వం అని ప్రశ్నించారు. డబుల్ ఇంజన్ సర్కార్ లో కేంద్రం నుండి కనీసం ఎరువులు కూడా తెప్పించుకోలేరా అని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున యుద్ధ ప్రాతిపదిక న ప్రభుత్వం వెంటనే ఎరువుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ... సీపీఐ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కౌన్సిల్‌కు 101 మందిని, పదిమంది కాండేట్ సభ్యుల్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. అలాగే 31 మంది సభ్యులు, ఇద్దరు ఆహ్వానితులతో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఇక సెక్రటేరియట్, అసిస్టెంట్ సెక్రటరీ, సెక్రటరీ లను పార్టీ జాతీయ మహాసభల అనంతరం విజయవాడలో కౌన్సిల్ ఏర్పాటు చేసి జాతీయ నాయకుల సమక్షంలో ఎన్నుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కే నారాయణ లకు అత్యవసర పనులున్న కారణంగా సెక్రెటరీ ఎన్నిక వాయిదా పడినట్లు తెలిపారు. వారి సూచనల మేరకు అప్పటివరకు సెక్రటేరియట్, అసిస్టెంట్ సెక్రటరీలు, రాష్ట్ర సెక్రటరీ ని యథాతథంగా కొనసాగించాలని సూచించారన్నారు. రాష్ట్ర మహాసభ కేవలం రాష్ట్ర కౌన్సిల్ ఎన్నుకోవడంతో ముగిసిందని రామకృష్ణ పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని, కార్యదర్శి వర్గాన్ని, అసిస్టెంట్ సెక్రటరీలను, సెక్రటరీలను ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర మహాసభ విజయవంతంలో పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించినందుకు మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర మహాసభల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

వైష్ణోదేవి మార్గంలో ఐదుగురి మృతి

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నేపథ్యంలో భక్తులు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, ఆలయ బోర్డు అధికారిక సమాచారానికి అనుగుణంగా వ్యవహరించాలని అధికార యంత్రాగం భక్తులను కోరింది. కాగా, భారత వాతావరణ శాఖ జమ్మూకశ్మీర్‌లోని పలు ఏరియాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతంలోని పలు నదులు ప్రమాదస్థాయికి మించి ప్రవహిస్తుండటంతో మరిన్ని చోట్ల కొండచరియలు విరిగిపడొచ్చని, మెరుపువరదలు సంభవించవచ్చని అప్రమత్తం చేసింది. జమ్మూలోని రెండు ప్రాంతాల్లో క్లౌడ్‌బరస్ట్‌ల కారణంగా నేషనల్ హైవే-244 కోట్టుకుపోయినట్టు దోడా డీసీ హర్వీందర్ సింగ్ తెలిపారు. మెరుపువరదలకు గాంధోహ్‌లో ఇద్దరు, థాత్రి సబ్‌డివిజన్‌లో ఒకరు చనిపోయినట్టు తెలిపారు. 15కు పైగా ఇళ్లు, పలు గోశాలలు, ఒక ప్రైవేటు ఆరోగ్య కేంద్రం దెబ్బతిన్నాయి. ముగ్గురు పాదచారుల వంతెనలు వరదలకు కొట్టుకుపోయాయి.

దేశంలో ఎక్కడా లేని భూసమస్యలు తెలంగాణలోనే

(మొదటిపేజీ తరువాయి)

మురళీధర్ రెడ్డి హైకోర్టుకు తెలిపారు. ఇందులో కేవలం 95 ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూమి అని, మిగతాది పట్టా భూమి అని చెప్పారు. సర్వే నెంబర్ 194లో 383 ఎకరాలు, సర్వే నెంబర్ 195లో 370 ఎకరాల భూమి ఉందన్నారు. 2012 జూన్ వరకు ఈ భూమి పట్టా భూమిగానే ఉన్నప్ప టికీ పొరపాటున నిషేధిత జాబితాలో చేర్చారని, ఆ తర్వాత సరిదిద్దడంతో భూ యజమానుల పేరు మీద పట్టాలు వచ్చాయని కోర్టుకు తెలిపారు. 95 ఎకరాల నిషేధిత భూమిలో మాత్రం ఎలాంటి లావాదేవీలు జరగడంలేదన్నారు. నాగారంలో 700 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయని, 2019 వరకు నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ 2018లోనే వీటికి పట్టాలిచ్చారని మహేశ్వరం మండలం అమీర్‌పేటకు చెందిన మహేశ్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు పట్టాలెలా ఇచ్చారో సమాధానం చెప్పాలని రెవెన్యూ శాఖకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాల్లో ఏమాత్రం వాస్తవం లేదని, అవి పట్టా భూములేనని మంగళ వారం జరిగిన విచారణ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మాత్రమే ప్రభుత్వ భూముల సమస్య ఉందని జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. అధికారులు చెబుతున్న వివరాలకు, వాస్తవాలకు పొంతనలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. రెండేళ్ల వయసున్న వాళ్ల పేరుమీద పట్టా భూమి ఉన్నట్లు వివరాలున్నాయని చెప్పారు. దీంతో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసి.. విచారణను వాయిదా వేసింది.

మూడు నెలల్లో తీర్పులివ్వాల్సిందే

హైకోర్టులకు గడువు విధించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : హైకోర్టు న్యాయమూర్తులు తరచూ తీర్పులను నెలల తరబడి రిజర్వ్‌లో ఉంచే పద్ధతి పట్ల సుప్రీం కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. వారికి తీర్పులు ఇవ్వడానికి మూడు నెలల గడువును విధించింది, అలా చేయకపోతే గడువు దాటి రెండు వారాల్లోపు తీర్పు ఇవ్వకపోతే సంబంధిత కేసు/లు మరొక న్యాయమూర్తికి అప్పగించడం జరుగుతుందని స్పష్టం చేసింది. దీనిని 'చాలా దిగ్భ్రాంతికరమైనది, ఆశ్చర్యకరమైనది' అని అభివర్ణించిన న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం సోమవారం ఇలా పేర్కొంది : 'అటువంటి పరిస్థితిలో న్యాయ ప్రక్రియపై న్యాయవాది తన విశ్వాసాన్ని కోల్పోతాడు' అని వ్యాఖ్యానించింది. ధర్మాసనం తరపున తీర్పు రాస్తూ న్యాయమూర్తి జస్టిస్ మిశ్రా ఇలా అన్నారు : ఈ కోర్టు అనేక సార్లు ఇలాంటి విషయాలను ఎదుర్కొంటోంది. హైకోర్టులో మూడు నెలలకు పైగా విచారణలు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ఆరు నెలలకు పైగా లేదా సంవత్సరాలకు పైగా విచారణ తర్వాత తీర్పులు వెలువడలేదు' అని తెలిపింది. 'కొన్ని హైకోర్టులు హేతుబద్ధమైన తీర్పు లేకుండా తుది ఉత్తర్వును ప్రకటించే పద్ధతిని అవలంభించాయి. ఇది చాలా కాలం పాటు అందని కారణంగా బాధిత పక్షం మరింత న్యాయపరమైన పరిష్కారాన్ని కోరే అవకాశాన్ని కోల్పోతుంది' అని అది పేర్కొంది. 'చాలా హైకోర్టులలో తీర్పు జారీలో జాప్యం గురించి సంబంధిత బెంచ్ లేదా చీఫ్ జస్టిస్ దృష్టికి తీసుకురావడానికి కక్షిదారుడు సంప్రదించగల యంత్రాంగం లేదని ధర్మాసనం ఎత్తి చూపింది. 'మూడు నెలల్లోపు తీర్పు వెలువడకపోతే రిజిస్ట్రార్ జనరల్ (హైకోర్టు) ఆదేశాల కోసం విషయాలను ప్రధాన న్యాయమూర్తి (హైకోర్టు) ముందు ఉంచుతారు. ప్రధాన న్యాయమూర్తి రెండు వారాల్లోపు ఆదేశాన్ని ప్రకటించడానికి సంబంధిత బెంచ్ దృష్టికి తీసుకువస్తారు, లేకుంటే ఈ విషయాన్ని మరొక ధర్మాసనానికి అప్పగిస్తారు' అని స్పష్టం చేసింది.

గవర్నర్లకు ఆ అధికారం ఉందా?

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ఏఎస్ చంద్రుర్కర్‌తో కూడిన ఐదురుగు సభ్యుల ధర్మాసనం విచారించింది. విచారణ నాల్గో రోజు మంగళవారం సాగింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. గవర్నర్ ఏదేని బిల్లును నిలిపివేస్తే, అది రద్దు అవుతుందని చెప్పారు. ఆమోదించని బిల్లులను అసెంబ్లీ పున:పరిశీలనకు తిప్పి పంపాలని తమిళనాడు, పంజాబ్ గవర్నర్ల కేసుల్లో సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేశారు. బిల్లులను ఆమోదించడం కోసం గవర్నర్లకు, రాష్ట్రపతికి గడువు నిర్దేశించడం వారికి ఉండే విచక్షణాధికారాలను తక్కువ చేయడమే అవుతుందని వాదించారు. మహారాష్ట్ర తరపున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే కోర్టుకు హాజరయ్యారు. బిల్లులను ఆమోదించే అధికారం గవర్నర్ లేక రాష్ట్రపతికి ఉంటుందని కోర్టులకు లేదని వాదించారు. గవర్నర్ జాప్యం చేసినంత మత్రానా రాజ్యాంగబద్ధ తప్పిదం అయిపోదన్నారు. గవర్నర్‌కు ఎలాంటి గడవు ఉండదని వాదనలు వినిపించారు. ఆయన సింహాసపంపై కూర్చొని నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు. రాజస్థాన్ తరపున సీనియర్ న్యాయవాది మనీందర్ సింగ్, పుదుచ్చేరి తరపున సీనియర్ న్యాయవాది వినయ్ నవారే, గోవా తరపున అదనపు సొలిసిటర్ జనరల్ విక్రమ్‌జిత్ బెనర్జీ, మధ్యప్రదేశ్ తరపున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్, చత్తీస్‌గఢ్ తరపున సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలానీ వాదనలు వినిపించారు. ఏదని శాసనం గవర్నర్ ఆమోదం లేకుండా చట్టరూపం దాల్చలేదని, ఈ వ్యవహారాల్లో కోర్టు జోక్యం చేసుకోరాదని గోవా తరపున బెనర్జీ వాదించారు. లాంఛన ప్రాయంగా భావిస్తే అసలు గవర్నర్ ఆమోదం కోసం బిల్లులను పంపాల్సిన అవసరం ఏమిటని మధ్యప్రదేశ్ న్యాయవాది కౌల్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే గవర్నర్ నిర్ణయం కీలకమని చత్తీస్‌గఢ్ న్యాయవాది జఠ్మలానీ అన్నారు. మనీ బిల్లులకు నిర్దేశిత కాలం ఉండదని వాదించారు. వాదనలు అసంపూర్తిగా ఉండటంతో తదుపరి విచారణ ఈనెల 28వ తేదీన జరగనుంది. ఆ రోజు ప్రత్యర్థి పార్టీలు తమ వాదనలు వినిపిస్తాయి.

క్షయ రహిత సమాజానికి కృషి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : క్షయ రహిత సమాజానికి కృషి చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘు వారి సహకారం తో ప్రధానమంత్రి టీబి ముక్త్ భరత్ అభియాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రవి రాథోడ్ పాల్గొని విశ్రాంత ఉద్యోగులతో కలిసి క్షయ వ్యాధిగ్రస్థులకు పోషకాహార కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి క్షయ వ్యాధిగ్రస్తులకు పోషక ఆహార కిట్లు అందించి, క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అందరూ సహకరించాలని కోరారు. క్రమం తప్పని మందులతో పాటుగా పోషకాహారం తీసుకుంటే టీబి వ్యాధిని జయించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మౌనిక, క్షయ వ్యాధి ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయకుమార్, ఎక్స్టెన్షన్ ఆఫీసర్ తోట శ్రీనివాస్,టి జి జి ఆర్ ఏ అధ్యక్షులు మైస నాగయ్య కార్యదర్శి వి సోమయ్య సభ్యులు వెంకటయ్య, జనార్ధన్, ఐ వి రమణయ్య, నారాయణ, టీ అరుణ కుమారి, ఆర్ వెంకట్ రెడ్డి, రత్నమాచారి, ప్రవీణ్ కుమార్, యాదగిరి, జనార్ధన్ క్షయ వ్యాధి సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు అందని ఉపకార వేతనాలు

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా: ప్రభుత్వం తరపున అందిస్తున్న రాష్ట్రవ్యాప్తంగా వికలాంగుల ట్రాన్స్ జెండర్ వయోవృద్ధులు, ఉపకార వేతనాలు ఇవ్వబడుతుంది అని, ప్రకటన వెలువడిన టి ఎస్ ఓబి ఎంఎంఎస్ ఆన్లైన్ ద్వారా ఎన్నిసార్లు అప్లై చేసుకున్న అర్హులకు అందివ్వడంలో అధికారులు విఫలమవుతున్నారని వికలాంగుడు ఆరోపిస్తున్నాడు, వివరాల్లోకి వెళితే ఖానాపూర్ పట్టణంలో శీను అనే ఒక వికలాంగుడు విధి రాసిన వింత పరీక్షలో విధి వంచితుడిగా కాబడి సర్వం కోల్పోయి 85% వికలాంగుడిగా మిగిలి నాటి నుండి వికలాంగుల కోటాలో పునరావాస పథకాల కింద నాలుగవసారి ఆన్లైన్ చేసుకొని కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లి అప్లికేషన్ పెట్టుకోగా ఈసారి ఎంపిక విధానం జరిగిపోయింది మరోసారి అంటూ రిసీవ్డ్ కాఫీలు అందిస్తున్నారు తప్ప లబ్ధి చేకూర్చలేకపోతున్నారు. ఎటువంటి ఇంటర్వ్యూకి లేఖ పంపియకుండానే ఇంటర్వ్యూ లేఖ వేశామంటూ ఫోన్ కాల్ చరవాణిలో ఇంటర్వ్యూకి పిలవకుండానే పిలిచామంటూ 85% వికలాంగత్వం కలిగి ఉండి అర్హుడిగా గుర్తించబడి ఉన్న నాకు అన్యాయం చేస్తున్నారు. బి డబ్ల్యు ఓ శాఖలో పల్లెల పట్టణాల అధికారిక ఆఫీసులు ప్రజల వద్దకు తిరిగి అధికారి పథకం లబ్ధి పొందిన తదుపరి పర్సంటేజీలా పర్వంతో అర్హులను అనర్హులుగా గుర్తిస్తూ అనర్హులను అర్హులుగా ఎంపిక చేస్తూ పథకాలను అందించి ఆర్థికంగా సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.

వయోజన విద్యలో నూరుశాతం అక్షరాస్యత సాధించాలి

విశాలాంధ్ర-తొర్రూరు: వయోజన విద్యలో తొర్రూరు మండలం 100 శాతం అక్ష రాస్యత సాధించాలని తొర్రూరు మండల ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ తొర్రూరు పాఠశాలలో జరిగిన వయోజన విద్య ప్రగతికి సంబందించిన ఉల్లాస్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధ్యాయులు, మహిళా సంఘాలకు చెందిన బిఏఓ లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ ఉల్లాస్ శిక్షణను ఉపయోగించి ఆ యా గ్రామాల లోని వయోజనులకు విద్యా బోధన నందించే వలేంటర్ ఉపాధ్యాయులకు తగిన శిక్షణ, సలహాలు, సూచనలను అందించాలని కోరారు. ఆ యా గ్రామాలలో ఉన్న నిరక్షరాస్యులకు విద్య నందించి 100 శాతం అక్షరాస్యత సాధించడానికి అందరూ తమ వంతుగా కృషి చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పులి ముత్తిలింగం వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్ఫ్ శాఖ ఏపిఎం సునీత , సీసీలు పద్మావతి, వెంకటేశ్వర్లు, సోమిరెడ్డి, వివిధ పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు, బిఏఓలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలి

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : ఇందిరమ్మ ఇండ్లను నాణ్యత ప్రమాణాలతో నిర్మించుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చెప్పారు. మంగళవారం ఆయన చివ్వేముల మండలం, గుంపుల తిరుమలగిరిలో పందిరి నవ్య నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇల్లును పరిశీలించారు.లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను ఖచ్చితమైన కొలతలతో, ప్రభుత్వం నిర్దేశించిన స్థలములోనే నిర్మించుకోవాలని, స్థానిక మేస్త్రీల తో ఇంటి నిర్మాణాలు చేపట్టాలని, ముందుగా అగ్రిమెంట్ చేసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, దానిని సద్వినియోగం చేసుకొని త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గుంపుల తిరుమలగిరి లోని ఉన్నత పాఠశాలను, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.9 వ తరగతి కి వెళ్లి విద్యార్థులతో తెలుగు చదివించారు.ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, అప్పుడే మంచి ఫలితం వస్తుందని, కష్టపడే మనస్తత్వాన్ని విద్యార్థి దశ నుండే అలవాటు చేసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివితేనే భవిష్యత్తు ఉంటుందని, ఎంత కష్టపడి చదివితే, మనకు అంత ప్రతిఫలం వస్తుందని కావున ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలని అన్నారు. ప్రైమరీ స్కూల్ లో 4,5 తరగతులకు వెళ్లి విద్యార్థులతో ఎక్కాలు చదివించారు, ఇంగ్లీషు, లెక్కలు చేయించారు.పిల్లలు బాగా చదివడం పై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. వంట గదిని పరిశీలించారు.వంట గదిలో వెలుతురు ఉండే విధంగా చూసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ అన్నారు.తహసిల్దార్ సంతోష్, ఎంపీడీవో ప్రకాష్ రావు, , ఎంఈఓ కళా రాణి, హెడ్మాస్టర్ బి. శైలజ, హౌసింగ్ ఏఈ ప్రేమలత, పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.

8 మంది మావోయిస్టు దళ సభ్యులు లొంగుబాటు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : మావోయిస్టు పార్టీకి చెందిన 8 మంది దళ సభ్యులు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట లొంగిపోయారు. మంగళవారం ఎస్పి మీడియా ముందు వివరాలు తెలిపారు. జిల్లా పోలీసులు, 81, 141 సీఆర్ పిఎఫ్ బెటాలియన్ అధికారులు సంయుక్తంగా ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూత వల్ల మావోయిస్టులు లొంగిపోతున్నారని తెలిపారు. లొంగిపోయిన సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకుంటున్న మావోయిస్టు నాయకులు సభ్యులు లొంగిపోతున్నట్లు తెలిపారు. తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడపాలని చాలామంది నక్సలైట్లు భావిస్తున్నారన్నారు. మంగళవారం లొంగిపోయిన

వారు ఆ పార్టీలో వివిధ స్థాయిలో పనిచేస్తున్నట్లు తెలిపారు. చత్తీస్గడ్ బీజాపూర్ జిల్లాకు చెందిన వెట్టి సోందా, ఇతని భార్య లక్మే, వొయం లక్ష్మణ్, పోడియం కోస, మూడేం కొస, మాడవి నందు, కారం సోముడు ఎస్పీ ముందు లొంగిపోయిన వారిలో వున్నారు. ఆపరేషన్ చేయూత' కార్యక్రమం ద్వారా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు వీరితో కలిపి 314 మంది మావోయిస్టు దళసభ్యులు లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కొసం కృషిచేస్తున్న నేపథ్యంలోనే లొంగుబాట్లు పెరిగాయన్నారు. మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం కొత్తగూడెం జిల్లా నుండి 5 మంది సభ్యులు పనిచేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం నుండి కేవలం 81 మంది వివిధ రాష్ట్రాలలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. కాగా ఈ రోజు లొంగిపోయిన 8 మంది మావోయిస్టులకు తక్షణ సహాయంగా ప్రతి ఒక్కరికి రూ. 25 వేల చొప్పున మొత్తం రూ.2 లక్షలు ఇవ్వడం జరిగింది. మిగతా నగదును ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్స్ వచ్చిన తర్వాత వారి ఖాతాలలో వేస్తామన్నారు.

నేరాలపై ఎస్పీ సమీక్ష

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : జిల్లా పోలీస్ స్టేషన్ల పరిధిలోని, ఆయా రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్స్ గురించి ఆరా తీసి, వారిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉండాలని, వారి వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పి. పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డా.శబరిష్ పి. పోలీస్ శాఖ నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా జిల్లాలో విగ్రహాలు ప్రతిష్టించే ప్రతి ఒక్కరు కూడా, ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే విధంగా, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే మండపాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనేలా చూడాలని అన్నారు. విగ్రహాల ఏర్పాటు అనంతరం వాటిని జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. మండపాలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ కావలసిన ఏర్పాట్లు ముందుగానే చేయాలని సూచించారు. కోర్టులో ట్రయల్ లో ఉన్న కేసుల గురించి ఆరా తీసి, ప్రతికేసులోను తప్పనిసరిగా, సాక్షులకు,

ముద్దాయిలకు సమన్లు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు శిక్ష పడే విధంగా కోర్టు కానిస్టేబుల్ లు విధులు నిర్వహించాలని, అంతిమంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలలో నమోదైన కేసుల వివరాలపై పోలీస్ స్టేషన్ ల వారీగా ఆరా తీసి, కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రతి కేసులోనూ ఎప్పటికప్పుడు ఆన్లైన్లో ఫైల్ అప్డేట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పాత కేసుల దర్యాప్తులో పురోగతిని పరిశీలించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజలలో అవగాహన తీసుకొని వచ్చి, కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచనలు చేశారు. మహిళలపై జరిగే నేరాలలో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు.యువత, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా సైబర్ క్రైమ్ నేరాలపై ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధి లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్ బి ఇన్స్పెక్టర్ శంకర్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ కుమార్, ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్ , ములుగు సి ఐ సురేష్, వెంకటాపురం సిఐ రమేష్, పస్రా సిఐ దయాకర్, ఎస్ఐ ములుగు ఎస్ఐ వెంకటేశ్వరరావు, వెంకటాపూర్ ఎస్ఐ రాజు, పస్రా ఎస్ఐ కమలాకర్, ఎస్ఐ తాడ్వాయి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఏటూరునాగారం ఎస్ఐ రాజ్ కుమార్, మంగపేట ఎస్ఐ సురేష్, ఎస్సై కన్నాయిగూడెం ఎస్ ఐ వెంకటేష్, ఎస్ఐ వాజేడు ఎస్ ఐ సతీష్ , ఎస్ఐ పేరూరు ఎస్ ఐ కృష్ణ ప్రసాద్, వెంకటాపురం ఎస్ఐ తిరుపతి, డిసిఆర్బి ఎస్సై జగదీష్, ఐటీ కోర్ టీం, డిసిఆర్బి సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పోరాటాలతోనే పరిష్కారం

విశాలాంధ్ర -ఖమ్మం : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో న్యాయస్థానం పునరాలోచించాలని జర్నలిస్టుల ఎండ్ల స్థానాలు సమస్య పోరాటాల తోనే పరిష్కారం అవుతుందని టియుడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ అన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఖమ్మం నగర కమిటీ సమావేశం మంగళవారం స్థానిక జడ్పీమీటింగ్‌హాల్లో జరిగింది. యూనియన్ నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామ్ నారాయణ మాట్లాడుతూ మీడియా రంగంలో వచ్చిన మార్పులు కొన్నింటిని ఆహ్వానిస్తూనే జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, కనీస వేతన అమలు తదితర విషయాలపై యూనియన్ నేతత్వంలో ఆందోళనలు చేపట్టక తప్పదన్నారు. నివాస స్థలాల పట్ల పాలకులు సరైన రీతిలో స్పందించడం లేదని పంపిణీ చేసే అవకాశం ఉన్న చోట కూడా మోకాలు అడ్డున్నారన్నారనీ అన్నారు .జర్నలిస్టులకు అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో క్యాష్ లెస్ వైద్యం అందించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించి వేస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమని అందుకు సిద్ధం కావాలని రామ్ నారాయణ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం వేణుగోపాలరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి,

నర్వనేని వెంకట్రావు, జిల్లా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైస పాపారావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మామిడాల భూపాల్ రావు, మహేందర్, స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, మాజీ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు. జిల్లా కోశాధికారి జనతా శివానందనగర కార్యదర్శి జనార్ధన చారి, కోశాధికారి ఏలూరి వేణుగోపాలరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నామా పురుషోత్తం, శ్రీనివాసరావు కోశాధికారి కళ్యాణ్ చక్రవర్తి, పుసులూరి సత్యనారాయణ, అప్పారావు, ఖమ్మం టీవీ శ్రీనివాస్, రజిని కుమార్ రెడ్డి, మేడి రమేషు, ఉదయ్ భాస్కర్, సింగం జనార్ధన్, రవి, భాను, ప్రకాష్, నాగేశ్వరరావు, బుర్రి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధనకు ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. విద్యార్థులకు సూచించారు. మంగళ వారం కన్నాయిగూడెం మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు ఒకే తరగతి గదిలో కూర్చొబెట్టి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. అప్పటికే 10 తరగతిలో ఉపాధ్యాయుడు సోషల్ స్టడీస్ బోధిస్తుండడంతో ఆ పాఠానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. విద్యార్థుల తల్లిదండ్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు. సమస్యలేవైనా వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం కలెక్టర్ కన్నాయిగూడెం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి , ఆరోగ్య కేంద్రంలోని జనరల్ ఇన్ పేషెంట్ వార్డు, ల్యాబ్ టెక్నీషియన్

గదిని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఉద్యోగులు నిర్దేశిత, హెడ్- క్వార్టర్లలో ఉండి, ప్రజల అనారోగ్య సమస్యలు, వర్షకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి , సేవలు అందించాలని, జనరల్ ఇన్ పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకుని, వైద్యాధికారి, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకట నారాయణ, ఎం పి డి ఓ సాజిద, హెడ్మాస్టర్ రాజ శేఖర, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుడు డాక్టర్ అభినవ్, ఉపాధ్యాయులు నరేష్, కోటయ్య, లక్ష్మయ్య , విద్యార్థులు, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ఎరువుల కోసం బీఆర్ఎస్ ధర్నా

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: మంగళవారం రామగుండం పట్టణం అయోధ్యనగర్‌లో ప్రాథమిక సహకార సంఘం బ్రాంచి కార్యాలయం ముందు రోడ్డుపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేసి, రాష్ట్ర సర్కారు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మాట్లాడుతూ ఎరువుల కొరతకు కాంగ్రెస్, బీజేపిలే కారణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోపు ఐలయ్య యాదవ్, మాజీ జెడ్పిటిసి ఆముల నారాయణ, రామగుండం పట్టణ అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్, బందారి ప్రవీణ్, అర్షణపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ ను కలిసిన తరుణ్ నాయక్

విశాలాంధ్ర / కేసముద్రం: బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ని హైదరాబాద్ లో కేసముద్రం యువజన నాయకులు వాంకుడొత్ తరుణ్ నాయక్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కేటీఆర్

మాట్లాడుతూ తెలంగాణ సమాజ ఆకాంక్షల మేరకు బీఆర్ఎస్ సోషల్ మీడియా మొదట్నుంచి తన శక్తి కొద్దీ పనిచేస్తూనే ఉందన్నారు. నిబద్ధతతో పనిచేసే సోషల్ మీడియాకు కార్యకర్తలకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుందని.స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసి బీఆర్ఎస్ సత్తా చాటాలని తెలిపారు. ప్రభుత్వం మీద ప్రజలకు పీకల దాకా కోపం ఉందని, ఈ వ్యతిరేకతను సరిగ్గా వాడుకుంటే బీఆర్ఎస్ కచ్చితంగా గెలుస్తుందని అన్నారు.యువకులు ముందుకొచ్చి కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు వివరించగలిగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుతమైన ఫలితాలు వస్తాయి అన్నారు.

యునైటెడ్ బ్రూవరీస్ రాష్ట్రంలో కార్యకలాపాలు విస్తృతం

హైదరాబాద్: భారతదేశంలో ప్రముఖ బ్రూవర్ మరియు కింగ్‌ఫిషర్ ,హీనెకెన్ వంటి దిగ్గజ బ్రాండ్‌లకు నిలయమైన యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యుబిఎల్), ఈరోజు తెలంగాణలోని తమ ప్రస్తుత నిజాం బ్రూవరీలో అత్యాధునిక క్యానింగ్ లైన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయటానికి రూ. 90 కోట్ల వ్యూహాత్మక పెట్టుబడిని పెడుతున్నట్లు వెల్లడించింది, ఇది రాష్ట్రంలో సంస్థ నిర్వహిస్తోన్న రెండు బ్రూవరీలలో ఒకటి. ఈ ముఖ్యమైన చర్య భారతదేశంలో అతిపెద్ద , అత్యంత శక్తివంతమైన బీర్ మార్కెట్లలో ఒకటైన తెలంగాణాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్యాన్ బీర్ విభాగంలోకి యుబిఎల్ ప్రవేశాన్ని సూచిస్తుంది అని ఈ ప్రకటనపై యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ డైరెక్టర్ వివేక్ గుప్తా తెలిపారు. 'ఈ కొత్త కేంద్రం ఒక సంవత్సరం తమ కార్యకలాపాలను ప్రారంభించనుందని భావిస్తున్నామన్నారు. బ్రూవరీ యొక్క ప్రస్తుత 0.5 ఎంహెచ్ఎల్ సామర్థ్యానికి 0.4 మిలియన్ హెక్టోలీటర్లు జోడించబడుతుందన్నారు. దీనితో ఈ బ్రూవరీ మొత్తం సామర్థ్యం 0.9 ఎంహెచ్ఎల్‌కి చేరుకుంటుందని, ఇది ప్రధానంగా కింగ్‌ఫిషర్, కింగ్‌ఫిషర్ అల్ట్రా , హీనెకెన్ వంటి ప్రీమియం బ్రాండ్‌లను అందిస్తుందన్నారు. వీటిని క్యాన్లలో ప్యాక్ చేస్తారు, నవతరపు వినియోగదారులు దాని సౌలభ్యం, పోర్టబిలిటీ మరియు తాజాదనాన్ని నిలుపుకోవడం కోసం ఎక్కువగా ఇష్టపడే ఫార్మాట్ ఇది."ఈ పెట్టుబడితో, తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్యాన్ల విభాగంలోకి ప్రవేశించడానికి యుబిఎల్ సిద్ధంగా ఉందన్నారు. ఈ క్యాన్ల విభాగంలో కంపెనీ ఇప్పటివరకు ఇక్కడ కార్యకలాపాలను నిర్వహించటం లేదు. ఈ వ్యూహాత్మక విస్తరణ మారుతున్న వినియో గదారుల ప్రాధాన్యతలకను గుణంగా ఉంటుంది. భారతదేశంలోని అత్యంత శక్తివంతమైన బీర్ మార్కెట్లలో ఒకటైన యుబిఎల్ నాయకత్వాన్ని బలపరుస్తుంది. ఈ చర్య దాని జీసిసి కార్యకలాపాలలో హీనెకెన్ పెట్టుబడికి తోడుగా ఉంది, ఇది భారతదేశపు ఉత్సాహపూరితమైన బీర్ పరిశ్రమలో ఆవిష్కరణ, సామర్థ్య నిర్మాణం, స్థిరమైన కేటగిరీ వృద్ధికి కంపెనీ నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది అని చెప్పారు. 'భారతదేశంలోని అతిపెద్ద బీర్ మార్కెట్లలో తెలంగాణ ఒకటి, ఇక్కడ క్యాన్ల కు వినియోగదారుల నుంచి డిమాండ్ నిరంతరం పెరుగుతోంది. ఈ పెట్టుబడితో, కింగ్‌ఫిషర్, అల్ట్రా మరియు హీనెకెన్ యొక్క ఐకానిక్ రుచిని వినియోగదారులకు కొత్త మరియు ఉత్తేజకరమైన రీతిలో అందిస్తూ, ఈ అధిక-సంభావ్య ఫార్మాట్‌లో మార్కెట్ వాటాను పొందగలమని మేము విశ్వసిస్తున్నాము అని అన్నారు. ఈ విస్తరణ, భారతదేశ బీర్ విభాగంలో మారుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలను తీర్చడానికి , వృద్ధిని నడిపించడానికి మా నిబద్ధతను నొక్కి చెబుతుంది" అని అన్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం : కలెక్టర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలకు గ్రామీణ ప్రాంత పేద ప్రజలే వైద్యం కోసం వస్తారని, వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.మంగళవారం ఆమె మునుగోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఓపి రిజిస్టర్, ఏఎన్ సీ అలాగే ఈ డి డి , తదితర ఆమె పరిశీలించారు. సీజనల్ వ్యాధుల తో వచ్చిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర వ్యాధుల రోగుల వివరాలు అడిగారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలను పెంచాలని, అలాగే తప్పనిసరిగా ఈ డి డి క్యాలెండర్ ప్రదర్శించాలని, ఏ ఎన్ సి చెకప్ లు రెగ్యులర్ గా నిర్వహించాలని, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు.చండూర్ ఆర్డీవో శ్రీదేవి, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర-కోదాడ: స్థానిక ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి ఆదేశానుసారం కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు మంగళవారం పట్టణంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు పట్టణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ, రంగు రంగుల రసాయనాలతో ఆకర్షణంగా లేనప్పటికీ మట్టి విగ్రహాలనే పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. నవరాత్రి ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తూ పూజలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ టిపిరిశెట్టి రాజు, కాజా గౌడ్,ఒంటి పులి రమా శ్రీనివాస్,ఎర్రవరం సొసైటీ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు రావిళ్ళ కృష్ణారావు,లైటింగ్ ప్రసాద్, నెమ్మాది దేవమణి ప్రకాష్ బాబు,మేకపోతుల సత్యనారాయణ,గంధం పాండు, ఆర్.వెంకటేశ్వరరావు,గోల్డ్ షాప్ రమేష్,పారా వెంకటేశ్వరరావు,మల్లు నాగిరెడ్డి,తోకల విజయ, చామర్తి బ్రహ్మం,వేమూరి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-నేరేడుచర్ల : కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల భవన నిర్మాణ కార్మిక సంఘం మండల 3వ మహాసభ యారవ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యల్క సోమయ్య గౌడ్, సంఘం గౌరవ అధ్యక్షులు పారేపల్లి శేఖర్‌రావులు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సంక్షేమ పథకాలు మరిచి కార్మికులను మోసం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. కార్మికుల సొమ్ము కార్మికులకే ఖర్చు చేయకుండా, వెల్ఫేర్ బోర్డు నిధులను పక్కదోవ పట్టిస్తుందన్నారు. కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పరిష్కరించకపోతే పరిష్కరించుకోవడానికి కార్మికులంతా ఒకే తాటిపై ఉండాలన్నాని పోరాటానికి సిద్ధంగా ఉండాలనే లక్ష్యంతో జరుగుతున్న మండల మరియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు యారవ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి షేక్ సత్తార్, కోశాధికారి గుంజా రవీందర్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొదమగుండ్ల నగేష్,సిఐటియు మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి,గౌరవ సలహాదారులు షేక్ చిన్న ఖాజావలి,భవన, ఇతర నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

10 వేల 720 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: గత సంవత్సరము ఈ సమయానికి ములుగు జిల్లాలో 10 వేల 20 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేయటం జరిగిందని, ఈ సంవత్సరము 10 వేల 720 మెట్రిక్ టన్ను సరఫరా చేయటం జరిగిందని

మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటన లో తెలిపారు. రైతులు ఎవరు ఆందోళన చెందవల్సిన అవసరం లేదని, ములుగుజిల్లాలల్లోని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సూచనలు మేరకు ములుగు జిల్లాకి 27న 500 మెట్రిక్ టన్నులు, 31కి మరొక 500 మెట్లు యూరియా సరఫరా చేయబడుతుందన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ మాసానికి కావలసినటువంటి 4,000 మెట్రిక్ టన్ను ములుగు జిల్లాలో రైతు సోదరులకు సరఫరా చేయుటకు ఏర్పాటు చేయటం జరిగిందని పేర్కొన్నారు. రైతు సోదరులు ఎవరూ కూడా యూరియా కొరకు ఆందోళన చెందవద్దని, వ్యవసాయ శాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

పసికందుపై వీధి కుక్కల దాడి

విశాలాంధ్ర- పినపాక : ఇటీవల ఢిల్లీలో ప్రణాంతకంగా మారిన వీధి కుక్కల నివారణకు ఏకంగా అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్ట్ తీర్పు నిచ్చింది. దీంతో జంతుప్రేమికులు జాతీయ స్థాయిలో ఈ తీర్పు పట్ల నిరసనలు తెలిపిన సంగతి తెలిసిందే. మండలంలోని ఏడుళ్ల

బయ్యారం, వెంకట్రావుపేట గ్రామపంచాయతీలలో మంగళవారం నలుగురిపై వీధి కుక్కలు దాడి చేశాయి. సోమవారం సాయంత్రం 11 నెలల బాబు ఈశాన్విక్ ఇంటి ఆవరణలో ఉండగా కుక్కలు తీవ్రంగా దాడి చేసాయి. కొద్దిదురంలో ఆ బాబు తల్లి ఇంటి పనులు చేసుకుంటుంది. బాబు కేకలు వేయడంతో తల్లి వెంటనే వచ్చి కుక్కలను తొలింది. లేకుంటే బాబును చీల్చి చండడేవి. ఆ చిన్నారిని వెంటనే భద్రాచలం ఆసుపత్రికి మెరుగైన చికితకోసం తరలించారు. వీధి కుక్కల దాడిలో ఇటీవల పినపాక మండలంలో అనేక సంఘటనలు జరిగాయి. ఈ మధ్యనే కుక్కలు బయ్యారంలోని కాకర్ల వెంకటమ్మ (60), హన్సిక (6), నాగలక్ష్మి (27)ల పై దాడి చేశాయి. గాయాలపాలైన బాధితులు పినపాక ప్రభుత్వ ఆసుపత్రిలోకి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకున్నారు. ప్రభుత్వం వెంటనే పినపాక నియోజకవర్గంలో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించి ప్రజలను, పిల్లల ప్రాణాలను కాపాడాలని నియోజకవర్గ ప్రజలు వేడుకుంటున్నారు.

బంగారం దుకాణాలలో భద్రత పెంచాలి

విశాలాంధ్ర బ్యూరో, సంగారెడ్డి : అపరిచిత, అనుమానిత వ్యక్తుల నుండి బంగారం కొనుగోలు చేయరాదని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో సుమారు 150 మంది బంగారం దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బంగారం దుకాణాలలో సీసీ కెమెరాలు, వాల్ సెన్సార్లు, అలారమ్ వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, లైసెన్స్ ఆయుధాలు కలిగిన సెక్యూరిటీని నియమించుకోవాలి సూచించారు. అపరిచిత లేదా అనుమానిత వ్యక్తుల నుండి బంగారం కొనుగోలు చేయరాదని, దొంగసొత్తుకు సంబంధించిన ఆనవాళ్లను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. దుకాణ భద్రత, ఆర్థిక లావాదేవీల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని, జిల్లా పోలీసు అధికారుల ఫోన్ నెంబర్స్ కలిగి ఉండాలని, అత్యవసర సమయంలో డైల్ -100 చేయాలన్నారు. జిల్లాలో నేరాలను అరికట్టడంలో పోలీసులకు సహకరించాలని, భద్రతా చర్యలు ప్రతి ఒక్కరూ అమలు చేయాలని జిల్లా ఎస్పీ గారు దుకాణదారులను కోరారు. ఈ సమావేశం లో సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, పటాన్ చెర్వు డిఎస్పీ ప్రభాకర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్, వివిధ గోల్డ్ షాప్ లకు చెందిన సుమారు 150 మంది యజమానులు, గోల్డ్ స్మిత్ లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర భారతాన కుంభవృష్టి

జమ్ములో మెరుపు వరదలు

నలుగురి మృతి

దోడాలో కొట్టుకుపోయిన ఇళ్లు

జమ్మూ/చండీగఢ్/సిమ్లా: ఉత్తర భారతంలో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ తదితర ఉత్తరాది రాష్ట్రాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. ఈ వర్షానికి అనేక చోట్ల ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. జమ్మూలో భారీ వర్షాలు కురుస్తుండటంతో నలుగురు మరణించగా... రెండు డజన్లకు పైగా ఇళ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. దాదాపు అన్ని జలాశయాలు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. నగరంలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ లోతట్టు ప్రాంతాలు, రోడ్లు మునిగిపోయాయని అధికారులు తెలిపారు. అనేక ప్రాంతాల్లో పరిస్థితి 'చాలా తీవ్రంగా' ఉందని, పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించడానికి శ్రీనగర్ నుంచి జమ్మూకు తదుపరి విమానంలో వెళుతున్నట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. జమ్మూ-శ్రీనగర్, కిష్త్వార్-దోడా జాతీయ రహదారులపై ట్రాఫిక్‌ను నిలిపివేశారు. కొండచరియలు విరిగిపడటం లేదా ఆకస్మిక వరదల కారణంగా డజన్ల కొద్దీ కొండ రోడ్లు దెబ్బతిన్నాయి లేదా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. వర్షాల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా మాతా వైష్ణో దేవి మందిరానికి యాత్రను కూడా నిలిపివేసినట్లు వివరించారు. కాగా, గాండోలో ఇద్దరు, థాత్రిలో ఒకరు వేర్వేరు వర్ష సంబంధిత సంఘటనలలో మరణించగా, 15 ఇళ్లు, నాలుగు వంతెనలు దెబ్బతిన్నాయని చెప్పారు. కిష్త్వార్, రియాసి, రాజౌరి, రాంబన్, పూంచ్ జిల్లాల ఎత్తయిన ప్రాంతాల నుంచి కూడా ప్రభుత్వ, ప్రైవేటు మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు నివేదికలు వచ్చాయని, వాస్తవ పరిస్థితిని అంచనా వేసిన తర్వాతే బయటపడుతుందని అధికారులు తెలిపారు. జమ్మూలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ముఖ్యమంత్రి శ్రీనగర్‌లో సమావేశం నిర్వహించి, అధిక హెచ్చరికను కొనసాగించాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పొంగిపొర్లుతున్న మోధోపూర్ బ్యారేజీ లక్ష క్యూసెక్కులను దాటిందని, నిరంతరం పెరుగుతోందని, కతువా జిల్లాలో రావి నది వెంబడి ఉన్న అనేక లోతట్టు ప్రాంతాలలో భారీ వరదలు వస్తున్నాయని అధికారులు తెలిపారు. తరానా నది, ఉజ్ నది, మగ్గర్ ఖాడ్, సహర్ ఖాడ్, వాటి ఉపనదులైన కతువా, సాంబాలోని బసెంటర్, జమ్మూలో తవి చీనాబ్‌లలో నీటి మట్టాలు ఒకేసారి పెరుగుతున్నాయని, ఇప్పటికే ప్రమాద స్థాయిని దాటాయని వివరించారు.

వరదలు ప్రవహించే నదులకు దూరంగా ఉండాలని, సురక్షిత ప్రదేశాలకు మారాలని పోలీసులు, పౌర అధికారులు ప్రజలకు తరచూ ప్రకటనలు చేస్తున్నారు. వాతావరణ శాఖ ప్రకారం, ఉదయం 8.30 గంటలకు ముగిసిన గత 24 గంటల్లో కతువా జిల్లాలో అత్యధికంగా 155.6 మిమీ వర్షపాతం నమోదయింది. తరువాత దోడాలోని భదేర్వాలో 99.8 మిమీ, జమ్మూలో (81.5 మిమీ), కత్రాలో (68.8 మిమీ) వర్షపాతం నమోదయింది. జమ్మూ, సాంబా, కతువా, రియాసి, ఉధంపూర్, రాజౌరి, రాంబన్, దోడా, కిష్త్వార్ జిల్లాల్లోని అనేక చోట్ల ఆగస్టు 27 వరకు మేఘావృతాలు, ఆకస్మిక వరదలు, ఎత్తయిన ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని వాతావరణ సూచన అంచనా వేస్తున్నందున, అధికారులు ఇప్పటికే నీటి వనరులు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలను కోరుతున్నారు.

హిమాచల్‌లో వర్ష బీభత్సం

హిమాచల్ ప్రదేశ్‌లోని అనేక చోట్ల భారీ వర్షానికి కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడంతో అనేక దుకాణాలు కొట్టుకుపోయాయి, భవనాలు కూలిపోయాయి. నివాస ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో రహదారులను మూసివేశారు. అయితే సోమవారం రాత్రి నుంచి నివేదించబడిన ఏ సంఘటనలోనూ ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. కాంగ్రా, చంబా, లాహౌల్, స్పితి జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో మంగళవారం తీవ్రమైన వర్షాలు కురుస్తాయని స్థానిక వాతావరణ కార్యాలయం 'రెడ్' అలర్ట్ జారీ చేసింది.

ఉనా, హమీర్‌పూర్, బిలాస్‌పూర్, సోలన్, మండి, కులు జిల్లాలు, సిమ్లా నగరంలో తీవ్రమైన వర్షాలకు 'ఆరెంజ్' అలర్ట్ కూడా జారీ చేసింది. మరోవైపు, మంగళవారం తెల్లవారుజామున బియాస్ నది ఉధృతంగా ప్రవహించడంతో కులు జిల్లాలోని మనాలిలో ఒక బహుళ అంతస్తుల హోటల్, నాలుగు దుకాణాలు కొట్టుకుపోయాయి. అలాగే సోమవారం రాత్రి మండి జిల్లాలోని బలిచౌకి ప్రాంతంలో సుమారు 40 దుకాణాలు ఉన్న రెండు భవనాలు కూలిపోయాయి. భారీ వర్షాల నేపథ్యంలో వివిధ జిల్లా పరిపాలనలు అన్ని విద్యా సంస్థలను మూసివేయాలని ఆదేశించాయి. మంగళవారం ఉదయం సిమ్లా జిల్లా యంత్రాంగం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను మూసివేయాలని ఆదేశించింది. జూన్ 1 నుంచి ఆగస్టు 25 వరకు హిమాచల్ ప్రదేశ్‌లో సగటున 577.9 మి.మీ వర్షపాతం నమోదయింది. ఇది 22 శాతం ఎక్కువ. ఆగస్టులో ఇప్పటివరకు రాష్ట్రంలో 44 శాతం అధిక వర్షపాతం నమోదయింది.

పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో భారీ వర్షాలు

జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో భారీ వర్షాల తర్వాత ఉజ్, రావి నదులు, వాగులలో నీటి మట్టం పెరగడంతో పంజాబ్‌లోని పఠాన్‌కోట్ జిల్లాలోని భారత-పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలోని అనేక గ్రామాలు ప్రభావితమయ్యాయి. పంజాబ్ క్యాబినెట్ మంత్రి లాల్ చంద్ కటారుచక్ ఆదివారం బాధిత ప్రాంతాలను సందర్శించి, పరిస్థితిని సమీక్షించి, రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా నష్టానికి పరిహారం ఇస్తుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఉజ్, రావి నదులు, అలాగే వాగులలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వలన భారత్-పాక్ సరిహద్దు వెంబడి ఉన్న గ్రామాలలో పరిస్థితి దారుణంగా ఉంది.

ఆప్ నేత ఇంట్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు చేపట్టారు. ఆయన ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కుంభకోణానికి సంబంధించి ఈడీ మంగళవారం తనిఖీలు చేపట్టింది. ఢిల్లీలోని సౌరభ్ భరద్వాజ్ నివాసంతో పాటు మరో 12 ప్రాంతాల్లో ఏకకాలంలో దర్యాప్తు సంస్థ అధికారులు ఈ సోదాలు చేపట్టారు. 2018-19లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 24 ఆసుపత్రుల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం రూ.5,590 కోట్లతో ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఓ ఐసీయూ ఆసుపత్రిని ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా.. మూడేళ్లు దాటినా అది పూర్తికాలేదు. ఇందుకోసం రూ.800 కోట్లు ఖర్చు చేసినా.. కేవలం సగం పనులు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో ఆ ప్రాజెక్టులో అవకతవకలు ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. వీటి ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ కేసులోనే తాజాగా సౌరభ్ భరద్వాజ్ నివాసంలో తనిఖీలు చేపట్టింది. ఈ దాడులను ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సౌరభ్‌పై తప్పుడు కేసు నమోదు చేశారని ఆప్ పేర్కొంది. ఈడీ చెబుతున్న సమయంలో ఆయన మంత్రిగా లేరని తెలిపింది. కేవలం కక్ష సాధింపుకోసమే ప్రభుత్వ సంస్థల్ని దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీపై మండిపడింది.

బీహార్ ఎన్నికల ముందే బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపిక!

న్యూఢిల్లీ: త్వరలోనే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అయితే ఈలోపే బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. బీహార్ ఎన్నికల షెడ్యూల్ రాకముందే కొత్త అధ్యక్షుడిని నియమించాలని అధిష్టానం కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నికలు పూర్తికానున్నాయి. అనంతరం బీజేపీ కొత్త అధ్యక్షుడి నియామకాన్ని కూడా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్లుగా సమాచారం. ప్రస్తుతం జేడీ నడ్డా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అనేకమార్లు ఆయన పదవీకాలం పొడిగించారు. దీంతో కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాలని ఆ పార్టీ ఆలోచన చేస్తోంది. అంతకంటే ముందే ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్నాటక వంటి కీలక రాష్ట్రాల్లో కొత్త రాష్ట్ర అధ్యక్షులను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ మండలి సభ్యుడిగా, గుజరాత్ నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికవుతారు. అనంతరం కొత్త అధ్యక్షుడి నామినేషన్ పత్రాలకు ప్రతిపాదకులుగా వ్యవహరించడానికి వీరిద్దరూ అర్హులు అవుతారు. అయితే కొత్త జాతీయ అధ్యక్షుడి ఎంపిక కుల, ప్రాంతీయ లేదా సామాజిక సమీకరణాల ఆధారంగా జరగకూడదని పార్టీ నాయకత్వం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్టీని బలోపేతం చేసే వ్యక్తిని మాత్రమే ఎంపిక చేయనున్నట్లు సమాచారం. జాతీయ స్థాయిలో సంస్థాగతంగా మంచి అనుభవం ఉన్న సీనియర్ నేతకు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

శ్రీదేవి ఆస్తి కబ్జా...

కోర్టుకెక్కిన బోనీకపూర్

చెన్నై: తన భార్య దివంగత నటి శ్రీదేవి ఆస్తిని ముగ్గురు వ్యక్తులు కబ్జా చేశారంటూ బోనీ కపూర్ కోర్టును ఆశ్రయించారు. వారు చట్టవిరుద్ధంగా హక్కులను సొంతం చేసుకున్నారని ఆరోపించారు. ఆమె ఎంతో కష్టపడి ఆ స్థిరాస్తిని కొనుగోలు చేసిందని ఈ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. దాని వివరాలను కోర్టుకు వివరించారు. 1988 ఏప్రిల్‌లో శ్రీదేవి మద్రాసులో ఎంసీ సంబంద మొదలియార్ అనే వ్యక్తి వద్ద స్థిరాస్తిని కొనుగోలు చేశారు. దానికి సంబంధించిన పత్రాలన్నీ పరిశీలించిన తర్వాతే ఆమె దాన్ని కొనుగోలు చేసినట్లు బోనీ కపూర్ తెలిపారు. అతడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారని, వారందరి దగ్గర వారసత్వ ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించిన తర్వాతనే శ్రీదేవి ఈ ఆస్తిని సొంతం చేసుకున్నట్లు బోనీ కపూర్ వెల్లడించారు. అయితే, ఎంసీ సంబంద మొదలియార్ రెండో భార్య కుమారులు ఈ ఆస్తిలో వారికి వాటా ఉందంటూ తహశీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేశారన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్ణయంతో తాజాగా చట్టవిరుద్ధంగా దీని హక్కులను సొంతం చేసుకున్నారని బోనీ కపూర్ హైకోర్టులో కేసు వేశారు. మోసపూరితమైన పత్రాలను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన భార్య బతికి ఉండగానే మొదలియార్ రెండో వివాహం చేసుకున్నారన్న విషయాన్నీ బోనీ కపూర్ ప్రస్తావించారు. విచారించిన జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ నాలుగు వారాల్లోగా దీనిపై నిర్ణయం తీసుకోవాలని.. ధ్రువీకరణ పత్రం ఇచ్చిన తాంబరం తాలూకా తహసీల్దార్‌ను ఆదేశించారు.

కాంగ్రెస్ వాదిగానే చనిపోతా : డీకే

బెంగళూరు : ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన గీతాన్ని పాడినందుకు పార్టీలోనే విమర్శలు రావడంతో కుంగిపోయిన కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో దాని ప్రదర్శనపై ఎవరైనా బాధపడితే క్షమించండి అని, తాను కాంగ్రెస్‌వాడినని, అలాగే చనిపోతానని తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన శివకుమార్ ఇటీవల సభలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన గీతాన్ని పాడటం ద్వారా అందరినీ ఆశ్చర్యపరిచారు. మంగళవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఎవరైనా బాధపడితే నన్ను క్షమించండి. పార్టీ అధిష్టానం నుంచి ఎవరూ దీని గురించి నన్ను ప్రశ్నించలేదు. నేను అసెంబ్లీలో 'పాసింగ్ రిఫరెన్స్' చేశాను' అని తెలిపారు. 'నేను ఎవరికంటే పెద్దవాడిని కాదు. అందరికీ బలాన్ని ఇవ్వడానికి నా జీవితం ఉంది. నేను ప్రతి ఒక్కరి కష్టాల్లో అండగా నిలిచాను. అయినప్పటికీ నేను వారికి అండగా నిలుస్తాను. ఒక నమ్మకమైన కాంగ్రెస్ సభ్యుడిగా నేను ఎవరి మనోభావాలను గాయపరచకూడదనుకుంటున్నాను. కాంగ్రెస్ సభ్యులందరికీ, ఇండియా ఐక్య సంఘటనలోని అనేక రాజకీయ పార్టీ స్నేహితులకు వారు బాధపడవచ్చు. 'నేను చేయని తప్పు చేశానని మీరు భావిస్తే, నేను ఇప్పటికీ క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను' అని తెలిపారు. ఆగస్టు 21న జూన్ 4న చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో శివకుమార్ ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన 'నమస్తే సదా వత్సలే...' లోని రెండు పంక్తులను పఠించారు. సభలోని బల్లలను చరుస్తూ శివకుమార్ గీతం ఆలపించడాన్ని బీజేపీ స్వాగతించింది. కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం పట్ల తన విధేయతను పునరుద్ఘాటిస్తూ, 'కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం పట్ల నా విధేయతను ఎవరూ ప్రశ్నించలేరు' అని శివకుమార్ అన్నారు. 'నేను జన్మతః కాంగ్రెస్ సభ్యుడిని. నేను కాంగ్రెస్ సభ్యుడిగానే చనిపోతాను' అని తెలిపారు. అసెంబ్లీ లోపల ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన పాడటం ద్వారా శివకుమార్ ఎవరినైనా ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారా అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బి.కె.హరిప్రసాద్ సోమవారం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా శివకుమార్ ప్రార్థన చేయడానికి మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. ఎందుకంటే ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్‌తో సహా అందరికీ చెందినది. కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన అలా మాట్లాడితే క్షమాపణ చెప్పాల్సి ఉంటుంది' అని హరిప్రసాద్ డిమాండ్ చేశారు.

క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీలో ప్రపంచ హబ్‌గా భారత్

ప్రధాని మోదీ

అహ్మదాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, ఎగుమతుల రంగంలో భారత్ ముందడుగు వేసింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈవీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలకు ఎగుమతి కానున్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. "గణేశ్ ఉత్సవ్ సందర్భంగా మేక్ ఇన్ ఇండియాలో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇవాళ్టి నుంచి దేశీయంగా రూపొందించిన విద్యుత్ వాహనాలు 100 దేశాలకు ఎగుమతి అవుతాయి. విద్యుత్ వాహనాల్లో బ్యాటరీ తయారీ ముఖ్యమైన అంశమని మనందరికీ తెలుసు. కొన్నేళ్ల క్రితం వరకు బ్యాటరీలను దిగుమతి చేసుకున్నాం. విద్యుత్ వాహనాల తయారీని బలోపేతం చేయడానికి భారత్‌లోని బ్యాటరీలను ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగానే 2017లో టీడీఎస్‌జీ బ్యాటరీ యూనిట్‌కు శంకుస్థాపన చేశాం. భారత్‌కు ప్రజాస్వామ్య శక్తితో పాటు జనాభా అనుకూలత ఉంది. అధిక సంఖ్యలో నైపుణ్యంతో కూడిన మానవవనరులు అందుబాటులో ఉన్నారు. భారత్‌లో పెట్టుబడి పెడితే భాగస్వామ్యం అయిన ప్రతిఒక్కరికీ లాభదాయకమే" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్-జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. "సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగిందని అన్నారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, "మనం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి. అదేవిధంగా కీలక ఖనిజాల కోసం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించాం" అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మారుతి సుజుకీకి చెందిన తొలి ఎలక్ట్రిక్ వాహనం ఆవిష్కరణ

గుజరాత్‌లో రెండో రోజు పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, అంతకుముందు మారుతి సుజుకీ సంస్థకు చెందిన తొలి ఎలక్ట్రిక్ వాహనం ఈ-విటారాను ఆవిష్కరించారు. సుజుకీ, తోషిబా, డెన్సో సంస్థలు సంయుక్తంగా నిర్మించిన లిథియం అయాన్ బ్యాటరీ తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం హన్‌సల్‌పుర్‌లో ఉన్న మారుతి సుజుకీ కార్ల తయారీ యూనిట్‌ను మోదీ పరిశీలించారు. ఈ-విటారాకు సంబంధించిన విశేషాలతో పాటు ప్లాంట్‌లో ఉపయోగిస్తున్న ఆధునిక సాంకేతికతను కంపెనీ ప్రతినిధులు మోదీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని వెంట గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర భాయ్ పటేల్‌తో పాటు మంత్రులు పాల్గొన్నారు. దేశీయంగా రూపొందించిన ఈ-విటారాను జపాన్ సహా 100కుపైగా దేశాలకు ఎగుమతి చేస్తామని మారుతి సుజుకీ కంపెనీ తెలిపింది. ఐరోపాలో జరిగిన ప్రదర్శనలో మారుతి సుజుకీ సంస్థ తొలిసారి ఈ-విటారాను ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ-విటారా రెండు బ్యాటరీ వేరియంట్‌లతో మార్కెట్‌లోకి అందుబాటులోకి రానుంది.

శాంతిని కోరుకోవడం బలహీనతగా చూడొద్దు

త్రివిధ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్

భోపాల్: ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు...అది ఇప్పటికీ కొనసాగుతోందని త్రివిధ దళాధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా భావించరాదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీ వార్ కాలేజీలో మంగళవారం ప్రారంభమైన 'రణ్ సంవాద్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు. ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, "భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్ళం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు" అని అన్నారు. గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. "రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనా వేసేవారు. కానీ ఇప్పుడు, ఆపరేషన్ల వేగం, కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి" అని ఆయన తెలిపారు.'వికసిత భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం 'సశస్త్ర', 'సురక్షిత్', 'ఆత్మనిర్భర్'గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ 'రణ్ సంవాద్' సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించనున్నారు.

మాజీ ఉపరాష్ట్రపతి ధన్కర్ ఏం చేస్తున్నారంటే?

న్యూఢిల్లీ: మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ జులై 21న అనూహ్యంగా పదవికి రాజీనామా చేయడంపై రాజకీయ దుమారం రేగిన సంగతి విదితమే. అనారోగ్య కారణాల చేత పదవికి రాజీనామా చేసినట్లు రాష్ట్రపతికి లేఖ పంపినప్పటికీ దీనిపై ఎన్నో అనుమానాలున్నాయని, ఆయన చేత బీజేపీ అధిష్టానం బలవంతంగా రాజీనామా చేయించినట్లు ప్రతిపక్షాలు ఆరోపించాయి. అయితే అప్పటి నుంచి బహిరంగంగా ఎప్పుడూ కనిపించలేదు. దీంతో ఆయన ఏమయ్యారంటూ కేంద్రానికి లేఖలు రాశాయి. ధన్కర్ సమాచారం ఇవ్వాలంటూ అమిత్ షాను శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ కోరారు. తాజాగా జగదీప్ ధన్కర్ గురించి కీలక సమాచారం బయటకు వచ్చింది. ప్రస్తుతం ధన్కర్ ఓటీటీ షోలు చూడటం, టేబుల్ టెన్నిస్ ఆడటం, యోగా చేస్తున్నారంటూ ఓ అధికారి తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతిగా ప్రభుత్వం తగిన బంగ్లాను కేటాయించిందని చెప్పారు. అధికారికంగా కారు, ఎస్కార్ట్ కారు, సెక్యూరిటీ గార్డులు, ఇతర ప్రయోజనాలన్నీ లభిస్తాయని పేర్కొన్నారు. జాతీయ మీడియా కథనం ప్రకారం మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సాయంత్రం పూట ఆయన టేబుల్ టెన్నిస్ ఆడుతున్నట్లుగా తెలుస్తోంది. ఉదయం పూట మాత్రం యోగా సాధన చేస్తున్నారని సమాచారం. ఓ గురువు ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం ఓటీటీ వాచ్‌లిస్టులో ది లింకన్ లాయర్, హౌస్ ఆఫ్ కార్డ్స్ చూస్తున్నారు. వాస్తవానికి వృత్తిపరంగా ధన్కర్ న్యాయవాది కావడం విశేషం. ఇక భార్య సుదేష్ ధన్కర్ గత నెలలో రాజస్థాన్‌కు కనీసం మూడు రోడ్ ట్రిప్‌లు చేసినట్లు తెలుస్తోంది. జైపూర్‌లో పూర్వీకుల వ్యవసాయ భూమిలో ధన్కర్ దంపతులు రెండు వాణిజ్య భవనాలను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. కుమార్తె కామ్నా వాజ్‌పేయి గుర్గావ్ ప్రతిరోజూ సందర్శిస్తున్నారు. సుదేష్ ధన్కర్ చివరిసారిగా జైపూర్‌కు 7-10 రోజుల క్రితం ప్రైవేట్ సందర్శనకు వచ్చారని సమాచారం. జైపూర్ విమానాశ్రయం నుంచి కేవలం 15 నిమిషాల దూరంలో న్యూ సంగనేర్ రోడ్‌లో ఈ నిర్మాణం ఉంది.

అన్నామలైకు మంత్రి కుమారుడి షాక్

చెన్నై: తమిళనాడులో ప్రస్తుతం నిరసన రాజకీయాలు నడుస్తున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా అధికార పార్టీ నేతలు నిరసనలు తెలుపుతున్నారు. ఇటీవల ఓ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ రవి దగ్గర నుంచి డీఎంకే నేత భార్య జీన్ జోసెఫ్ డిగ్రీ పట్టా తీసుకునేందుకు నిరాకరించారు. వైస్ ఛాన్సలర్ దగ్గర తీసుకుని వెళ్లిపోయారు. గవర్నర్ తమిళ వ్యతిరేకి అని... అందుకే పట్టా తీసుకోలేదని ఆమె తెలిపారు. తాజాగా బీజేపీ నేత అన్నామలైకు కూడా అదే మాదిరిగా చేదు అనుభవం ఎదురైంది. క్రీడా కార్యక్రమంలో పతకం మెడలో వేస్తుండగా ఓ మంత్రి కుమారుడు నిరాకరించాడు. ఈ పరిణామంతో ఒకింత అన్నామలై షాక్‌కు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. రాష్ట్ర షూటింగ్ క్రీడలకు ముఖ్యఅతిథిగా అన్నామలై ఆహ్వానింపబడ్డారు. అనంతరం విజేతలకు మెడలో పతకాలు వేస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడు పరిశ్రమల మంత్రి టీఆర్‌బీ రాజా కుమారుడు సూర్య రాజ బాలు వంతు వచ్చింది. పతకం మెడలో వేస్తుండగా నిరాకరించాడు. చేతిలో తీసుకుని వెళ్లిపోయాడు. ఈ క్రమంలో అన్నామలై ఫొటో దిగి వెళ్లిపోయారు. గవర్నర్‌కు జరిగిన రెండు వారాలకే అన్నామలైకు ఇలాంటి అవమానం జరగడం చర్చనీయాంశమవుతోంది. అయితే ఈ నిరసనను అన్నామలై ఖండించారు. ఇదొక దురదృష్టకర నాటకం అని అభివర్ణించారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లోకి రాజకీయాలు తీసుకురావొద్దని విజ్ఞప్తి చేశారు.

అధికారం కోసం బీజేపీ కుట్రలు: ప్రియాంక

సుపౌల్: ప్రజల నమ్మకాన్ని కోల్పోయినందునే వారి ఓట్లను దొంగలించి గద్దెనెక్కాలని బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు. బీహార్‌లో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ఓటరు అధికార్ యాత్ర ఉత్సాహంగా సాగుతోంది. మంగళవారం సుపౌల్‌లో కొనసాగింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితర ఇండియా ఐక్య సంఘటన నాయకులతో కలిసి ప్రియాంక పాల్గొన్నారు. ఎస్‌యూవీపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. 'బీహార్‌లో బీజేపీ-జేడీయూ ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైంది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వలసలు, ఆర్థిక సంక్షోభం నివారించలేకపోయింది. దీంతో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. ఇప్పుడు అధికారం కోసం ఓట్లు దొంగలించేందుకు కుట్రలు చేస్తోంది' అని ప్రియాంక విమర్శించారు.

షోరూమ్‌లో భారీ అగ్నిప్రమాదం...

60 ద్విచక్ర వాహనాలు దగ్ధం

ముంబై: మహారాష్ట్రలోని పూణె లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాల షోరూమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి ఈ మంటల్లో పదుల సంఖ్యలో బైక్‌లు కాలి బూడిదయ్యాయి. నగరంలోని తారాబాగ్ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బండ్ గార్డెన్ రోడ్డులోని మూడంతస్తుల భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో టీవీఎస్ షోరూమ్, సర్వీస్ సెంటర్ ఉంది. సోమవారం రాత్రి 8:30 గంటల సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు చెలరేగినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. కాసేపటికే మంటలు భవనం మొత్తం వ్యాపించినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో షోరూమ్‌లోని దాదాపు 60 ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం నుంచి ఒకరిని సురక్షితంగా రక్షించారు. కాలిపోయిన వాహనాల్లో కొన్ని పెట్రోల్ వాహనాలు కాగా, మరికొన్ని ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. కొన్ని కొత్త వాహనాలు కాగా, మరికొన్ని రిపేయిర్స్ కోసం ఉంచిన వాహనాలు అని అధికారులు తెలిపారు. వాహనాలతోపాటూ కొన్ని స్పేర్ పార్ట్స్, కంప్యూటర్స్, ఫర్నిచర్, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, విలువైన పత్రాలు దగ్ధమైనట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు పూజించండి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో మేడ్చల్-మల్కాజిగిరి : విఘ్నాలు, సమస్యలు తొలగించి సకల శ్రేయస్సులు చేకూర్చాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల వల్ల జల వనరులు కాలుష్యం అవుతాయని, ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకై మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం మట్టి గణపతి విగ్రహాలను, అవగాహన గోడ పత్రికలను తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ప్రాంతీయ కార్యాలయం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగినది. మట్టి గణపతి ప్రతిమలను కలెక్టరేట్ సిబ్బందికి , ప్రజలకి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కూకట్పల్లి, బాలానగర్ జీడిమెట్ల ఏరియాలలో ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి జేఎల్బి హరిప్రియ, కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏవో) రామ్మోహన్, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త (ఏఈఎస్) జి. లింగయ్య, డి.రాకేష్ ప్రాజెక్ట్ అనలిస్ట్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : సిజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ యం.మన చౌదరి వైద్యాధికాలకు సూచించారు. మంగళవారం అల్వాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి, ల్యాబరేటరీ, లేబర్ గదిని, మందుల నిల్వలను, ఆసుపత్రికి సంబంధించిన అనేక రిజిష్టర్లను కలెక్టర్ పరిశీలించారు. ఇమ్యూనిజేషన్ ప్రక్రియను వైద్యాదికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నందున ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయాల అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అలాగే రోగులు అందిస్తున్న మందులను వాడేవిదంగా ఆశా వర్కర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షింస్తూ, వాటిపై అవగహన కల్పించాలని తెలిపారు. ఫీవర్ సర్వే నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకుంటూ, ఫీవర్ సర్వేను వేగవంతంగా నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని, ఆసుపత్రి విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వైద్యాధికారుల పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిని కలెక్టర్ ఆదేశించారు. వివిధ విభాగాలకు చెందిని మందులను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకుంటూ కాలం చెల్లిన మందులను వినియో గించకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రులతోపాటు పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. ఉమా గౌరి, డా. శైలజ, డిప్యూటి తహాశీల్దార్ పృథ్వీ, ఇతర వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర, మేడిపల్లి: శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మట్టి గణపతిని పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. అనే నినాదంతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం అన్ని కాలనీలలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వరరావు, ఎమ్మార్వో హసీనా, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, కాంగ్రెస్ నాయకులు అల్వాల దేవేందర్ గౌడ్, డి.ఈ. సాయినాథ్ గౌడ్, వార్డ్ ఆఫీసర్ రేఖ, వర్క్ ఇన్స్పెక్టర్ తిరుపతి, వార్డ్ ఆఫీసర్ జీవన్ రెడ్డి, మున్సిపల్ అధికారులతో కలిసి పాల్గొని ఆయా డివిజన్లలో ప్రజలకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ అన్ని డివిజన్లో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా ప్రతి ఒక్కరు మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని, కార్పొరేషన్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో కుటుంబసమేతంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని కోరుకుంటూ పీర్జాదిగూడ ప్రజలందరికీ తుంగతుర్తి రవి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు సకాలంలో యూరియా అందించాలి : సీపీఐ

విశాలాంధ్ర - మొయినాబాద్ : రైతులకు సకాలంలో యూరియా అందజేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె .రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు యూరియా సకాలంలో సరఫరా చేయాలనీ కోరుతూ చేవెళ్ల మండల కేంద్రంలో ధర్నా చేపట్టి ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాలు పడుతున్న సమయంలో రైతులకు ఎరువులు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియా సకాలంలో అందించాలని యూరియా దొరకక రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీ తీసేయడం భావ్యం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఎం. సుధాకర్ గౌడ్, రైతు సంఘం రైతు నాయకులు సత్తిరెడ్డి , పాపయ్య, మహిళా రైతు వెంకటమ్మ, గంగోత్రి, దేవి, లలిత పాల్గొన్నారు.

నేతన్నలకు మహర్దశ : మంత్రి తుమ్మల

నేతన్న భద్రత పథకాల లబ్దిదారులకు రూ.68.77 కోట్ల చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇందిరా మహిళా శక్తి పథకంతో ప్రజా ప్రభుత్వంలో నేతన్నలకు మహర్దశ పట్టిందని చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల లో నేతన్న పొదుపు నేతన్న భద్రత పథకాల లబ్దిదారులకు చెక్కులు పంపిణీ కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ మా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చేనేత రంగానికి సుమారు రూ.1000 కోట్ల నిధుల విడుదల చేశామన్నారు. రూ.168 కోట్లతో తెలంగాణ చేనేత అభయహస్తం పథకంలో భాగంగా నేతన్న పొదుపు, భరోసా, భద్రత పథకాల అమలు చేస్తుమన్నారు. గత ప్రభుత్వంలో సిరిసిల్ల శాసనసభ్యుడు చేనేత జౌళిశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ మాటలు చెప్పారు. బాకీలు మాఫీ చేయలేదన్నారు. నేత కార్మికుల కుటుంబాలలో



పొదుపు ప్రోత్సహించడానికి వారి భద్రత కోసం రెండు సంవత్సరముల కాలపరిమితితో పరిణతి చెందే విధముగా ఈ పథకం అమలు పరుస్తున్నామన్నారు.

జలమండలి ఉద్యోగులకు రూ. 5 కోట్ల నిధులు మంజూరు

విశాలాంధ్ర, హైదరాబాద్ : జలమండలి ఉద్యోగుల ఓటి బకాయిలు , పరిహారం రూ.5 కోట్లు విడుదల అయ్యాయి. పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐఎన్‌టియుసి హెచ్.ఎం.డబ్లు.ఎస్.ఎస్.బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు మొగుళ్ల రాజి రెడ్డి మంగళవారం జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో చేర్చించి వెంటనే ఓటి బకాయిలు, పరిహారం 5 కోట్లు విడుదల చేయించి వినాయక చవితి పండగ కానుక ఇచ్చారు.దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జలమండలి ఉద్యోగుల ఓటి బకాయిలు, పరిహారం 5 కోట్లు రూపాయలు జలమండలి యాజమాన్యం విడుదల చేసిందని ఐ ఎన్ టి యు సి హెచ్.ఎం.డబ్లు.ఎస్.ఎస్.బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగా మొగుళ్ల రాజి రెడ్డి తెలిపారు. హైదరాబాద్ జలమండలి కార్యాలయంలో మంగళవారం జలమండలి డైరెక్టర్ (ఫైనాన్స్) పద్మావతి ఈ మేరకు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సమక్షంలో రూ.5 కోట్లు

సర్క్యులర్ పత్రాన్ని మొగుళ్ల రాజి రెడ్డి కి అందజేశారు. ఈ సందర్భంగా మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరణ పాటుపడుతుందని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటాన్నారన్నారు. బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ జలమండలి ఉద్యోగులకు ప్రభుత్వం ఓటి బకాయిలు మరియు పరిహారం 5 కోట్లు విడుదల చేసి వినాయక చౌతి పండగ కానుకగా బహుకరించిందని చెప్పారు. మొగుళ్ల రాజి రెడ్డి మాట్లాడుతూ ఐఎన్‌టియుసి హెచ్.ఎం.డబ్లు.ఎస్.ఎస్.బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పోరాటాలు, వినతి పత్రాల ఫలితంగానే జలమండలి యాజమాన్యం నిర్ణయం తీసుకొని బలాయిలను విడుదల చేసిందని గుర్తు చేసారు. జేఏసీ విజ్ఞాపన పత్రాలపై స్పందించిన ఎండి అశోక్ రెడ్డి ఫైనాన్స్ విభాగం అధికారులతో వెంటనే మాట్లాడి, జులై వరకు బకాయి ఉన్న ఓటీ అలవెన్సులను విడుదల చేయాలని ఆదేశించారని చెప్పారు. ఈ సందర్భంగా జలమండలి ఉద్యోగుల కష్టనష్టాలను గుర్తించి వారిని ఆదుకోవడానికి ముందుకువచ్చిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ట్రేడ్ యూనియన్స్ జేఏసీ చొరవ వల్లనే ఉద్యోగుల బకాయిపడ్డ మొత్తం పరిహారాన్ని జలమండలి యాజమాన్యం చెల్లించడం జరుగుతుందన్నారు. అయితే ఉద్యోగులు తమ ఓటి వివరాలను ప్రతినెలా 10లోపు అందజేసినట్లైతే 15లోగా వారికీ ఓటి రుసుమును చెల్లించడం జరుగుతుందని మొగుళ్ల రాజి రెడ్డి తెలిపారు. ఐ ఎన్ టి యు సి ట్రేడ్ యూనియన్స్ జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు జేఏసీ రాఘవేంద్ర రాజు, అల్లి శ్రవాన్ కుమార్, ఎండీ జాంగిర్, బి.దేవేందర్, సైద్ అక్తర్ అలీ, బి.నర్సింగ్ రావు, బి.జయ్ రాజ్, బి.మహేష్ బి. సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్లకు మరమ్మతులు

విశాలాంధ్ర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) పరిధిలో రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా రోడ్డు మరమ్మతులు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పౌరుల భద్రత దృష్ట్యా ప్రధాన రహదారులపై గుంతలు, క్యాచ్‌పిట్స్, సెంట్రల్ మీడియన్ తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు మొత్తం 13,120 గుంతలు గుర్తించారు. వాటిలో 10,390 గుంతలు మరమ్మతులు చేయడం జరిగింది. అదేవిధంగా 522 క్యాచ్ పిట్స్ రిపేర్ పనులు, 301 క్యాచ్ పిట్ కవర్ రీప్లేస్‌మెంట్లు, 8 సెంట్రల్ మీడియన్ చిన్నపాటి రిపేర్ పనులు పూర్తి చేయడం జరిగిదని జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు.

జోన్ల వారీగా వివరాలు:

ఎల్‌బి నగర్ జోన్‌లో- 2,868 గుంతలు గుర్తించగా, వాటిలో 2,381 మరమ్మతులు చేయడం జరిగిందని, చార్మినార్ జోన్‌లో - 2,227 గుంతలకు, 1,826 మరమ్మతులు. ఖైరతాబాద్ జోన్‌లో - 1,721 గుంతలకు, 1,343 మరమ్మతులు చేపట్టడం జరిగిందని, శేరిలింగంపల్లి జోన్‌లో - 1,938 గుంతలకు, 1,290 మరమ్మతులు, కూకట్‌పల్లి జోన్‌లో- 1,941 గుంతలకు, 1,706 మరమ్మతులు చేశారు. సికింద్రాబాద్ జోన్‌లో - 2,425 గుంతలకు, 1,844 మరమ్మతు పనులు పూర్తయ్యాయని, జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు.

రహదారులపై ఉన్న అన్ని లోపాలను వేగవంతంగా సరిచేసి, వర్షాకాలంలో రోడ్ల భద్రత కోసం అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పౌరులు సమస్యలు గమనించిన వెంటనే జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్‌కి సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చికితకు ఉపముఖ్యమంత్రి అభినందనలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో ఇండియా తరపున చరిత్ర సృష్టించిన తెలంగాణ అమ్మాయి చికితను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్ పూర్ గ్రామానికి చెందిన చికిత తానిపర్తి ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-21 మహిళల విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించడంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. విశ్వవేదికలపైనే దేశ పతాకాన్ని రెపరెపలాడిస్తున్న తెలంగాణ బిడ్డ చికత మరిన్ని ఘన విజయాలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. శనివారం కెనడాలోని విన్నిపెగ్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా చికిత నిలిచింది. దేశానికి రాష్ట్రానికి గర్వకారణమని భట్టి విక్రమార్క అన్నారు. 20 ఏళ్ల ఈ యువ ఆర్చర్ టోర్నమెంట్ అంతటా అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించింది. అంతర్జాతీయ వేదికలపైన భవిష్యత్తులో సైతం చికిత ఇలాంటి అద్భుత విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆకాంక్షించారు.

పర్యావరణాన్ని కాపాడండి : ప్రియాంక

విశాలాంధ్ర - హైదరాబాద్ : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని సమాచార పౌరసంబంధాలశాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్.ప్రియాంక సూచించారు. మంగళ వారం డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సచివాలయం ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో సుమారు 150 మట్టి వినాయక విగ్రహాలను జర్నలిస్టు సోదరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణానికి నష్టం జరగకుండా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటూ ప్రజలకు వినాయక చవిత హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు డిఎస్ జగన్, జాయింట్ డైరెక్టర్లు కె. వెంకటరమణ, సమాచారశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాష్ట్రం ప్రథమ స్థానం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలోని అన్ని రాష్ట్రాలోకెల్లా తెలంగాణ రాష్ట్రమే అభివృద్ధి లో మొదటి స్థానంలో ఉందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలం లోని ఎల్లంబాయి తాండాలో ఎంజీఎన్ ఆర్ ఈజిస్ నిధులు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని గౌరవ మహబూబ్ నగర్ ఎంపి. డికె అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాకు పెద్ద గండి పెట్టిందని , అయినా ఎన్నికల సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీలను ఒక్కోటిగా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనం దగ్గర నూతన బోర్ మోటార్‌ను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా మహబూబ్ నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలంలోని కారం తాండాలో ఎంజీఎన్ ఆర్ ఈజిస్ పథకం కింద రూ.20 లక్షల్తో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్నిమహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి ఫలాలు అందరికీ అందజేస్తున్నామని ఆయన చెప్పారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాలను నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ

సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు చెన్నయ్య, నవనీత, లక్ష్మణ్, శ్రీను నాయక్, గోపాల్ నాయక్, యాదిరెడ్డి, కేశవులు, రాజు నాయక్, తిరుపతయ్య, దాసరి రఘు, విజయ్ నాయక్, జనార్దన్, కలీం, బొక్కి రాములు తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపిడిఓ యశోద తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులన పెండింగ్ లేకుండా నిబందనల మేరకు జారీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిబందనలకు అనుగుణంగా సత్వరమే జారీ చేయాలని ఆయన తెలిపారు. మంగళవారం బాచ్‌పల్లి మండలంలో పర్యటించిన అదనపు కలెక్టర్ తహాశీల్లార్ కార్యాలయాన్ని ఆకస్మింకగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులను, పరిపాలన పరమైన రిజిష్టర్లను ఆయన పరిశీలించారు. ప్రజల అవసరాల దృష్టిలో పెట్టుకొని కులం, లోకల్ (స్థానికత) సర్టిఫికెట్లు, ఆదాయం, ఇతరాత్ర సర్టిఫికెట్ల జారీ నిమిత్తం చేసుకున్న దరఖాస్తును పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. నిర్దేశించిన సమయం లోపు సర్టిఫికెట్లను జారీ చేయాలని ఆదేశించారు. సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. సిబ్బంది, శిక్షణ పొందిన సర్వేయర్ పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఆర్‌డి ఓ శ్యామ్‌ప్రసాద్, ఆర్ఐలు రేణుక, భానుచందర్, సర్వేయర్ సంధు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు

విశాలాంధ్ర, హైదరాబాద్ : మట్టిని దేవునిగా చేద్దాం, భక్తిని పూజగా అర్పిద్దామని, పర్యావరణపరిరక్షణకు మట్టి వినాయకులను వినియోగించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సిసి.నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల భవనములోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సి,నారాయణ రెడ్డి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్యావరణాన్ని పరిరక్షించడానికి మట్టి గణపతులనే పూజిద్దామన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ని నిర్మూలించే దిశగా మట్టిచే చేయబడ్డ గణనాథులను ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ వినాయక చవితికి జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజకు వినియోగించుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడా లని పిలుపునిచ్చారు. వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మట్టితో తయారు చేసిన వినాయకులను వాడాలన్నారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వలన పర్యావరణం కలుషితం అవుతున్నదని, కాలుష్య నివారణకు, పర్యా వరణాన్ని కాపాడుకోవడానికి మట్టి వినాయకులను వినియోగిం చాలన్నారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ వెంకట నర్సయ్య, ఏఇఎస్. ఆర్. మహేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు వేతనం పెంచాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ హేమలత అధ్యక్షతన ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి, ఎం.రేవతి కళ్యాణి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు వేతనం రూ.18000 ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆశా సమస్యలను పరిష్కరించాలన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆశ వర్కర్లతో వెట్టిచాకిరి చేయించుకొని కనీస వేతన జీవోను అమలు చేయనటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశ వర్కర్లు సమ్మె చేస్తుంటే సమ్మెల దగ్గరకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం చేస్తాము ఆశ వర్కర్ల సమస్యలు లేకుండా చేస్తామని వాగ్దానాలు చేసినప్పటికీ అధికారంలో వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా ఆ యొక్క వాగ్దానాలు ఏమయ్యాయి అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నాయకులకు ప్రశ్నించారు. ఆశ వర్కర్లకు పీఎఫ్ ఈఎస్ఐ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు పనిచేయడం లేదని పారితోషకాలు తగ్గించాలని వ్యతిరేక విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. పారితోషకాలు తగ్గించకుండా యథావిధిగా గతం చెల్లించినట్లుగా సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వము పెంచిన పారితోషకాల చెల్లింపు, వేతనం 18000 ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. 2021 జులై నుండి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ, ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారి కే. ఉన్ని కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు సమ్మెలో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టో పొందుపరిచిన హామీలను 2024 ఫిబ్రవరి 9న జులై 30 డిసెంబర్ 10న గత ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ఆశ వర్కర్లకు ప్రతి సంవత్సరం 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలి ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు ఆశలకు యూనిఫార్మ్ ప్రభుత్వమే సరఫరా చేసి నాణ్యమైనటువంటి బట్టలను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల రక్షణ కల్పించి డ్యూటీ చేసే సందర్భాల్లో వెహికల్స్ తో పాటు సిబ్బంది ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు తక్షణమే ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే. చలో హైదరాబాద్ కార్యక్రమానికి కూడా వెనుకాడమని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రాధా కోమలత వాసంతి అనిత సబియా లత పద్మ లలిత కవిత యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

విశాలాంధ్ర, బషీర్ బాగ్: ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర ఆధ్వర్యంలో హైదరాబాదులో వివిధ పాఠశాలల్లో పర్యావరణ అవగాహన సదస్సు లు మట్టి గణపతి పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ప్రపంచ పర్యావరణ సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అప్పికొండ అనురాధ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చాముండేశ్వరి పీఠాధిపతి శ్రీకృష్ణ చాముండేశ్వరి స్వామి పాల్గొని గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంబించారు .ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు, తల్లిదండ్రులకు తమ పీఠం ఆధ్వర్యంలో గత నాలుగు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం "మట్టి గణపతులను పూజిద్దాం మహాగణపతిని పూజిద్దాం "అన్న నినాదం తో ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది అన్నారు. ప్రముఖ అంతర్జాతీయ పర్యావరణవేత్త సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాయుడు మాట్లాడుతూ మన ప్రపంచ పర్యావరణ సంస్థ పర్యావరణ పరిరక్షణ మహా ఉద్యమంలో ఎన్నో అద్భుతమైన విజయాలు సాధించిందన్నారు. ఖైరతాబాద్ భారీ గణపతి విగ్రహం దగ్గర 2017వ సంవత్సరంలో "మట్టి గణపతిలే ముద్దు ముద్దు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు వద్దు" అన్న భారీ ర్యాలీని ఏర్పాటు చేసి ఖైరతాబాద్ ఉత్సవ సమితికి విజ్ఞప్తి చేయడం మూలంగా నేడు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కార్యక్రమాలు మహాగణపతి విగ్రహాన్ని కూడా మట్టితోనే ఏర్పాటు చేయడం నిజంగా ప్రపంచ పర్యావరణ సంస్థ కృషి అభినందనీయమని గురూజీ సందర్భంగా పేర్కొన్నారు. డాక్టర్ సిహెచ్ భద్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ గణపతి ఉత్సవాలలో ప్రతి ఒక్కరు ఆనందంగా పండుగ జరుపుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల మూలంగా చెరువులు, నదులు, కుంటలు, సరస్సులు, సముద్రాలు పూర్తిగా కలుషితం అయిపోయి అందులో ఉన్న జీవవైవిధ్యం పూర్తిగా అంతరించిపోయే ప్రమాదంలో ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి పాల్గొన్నారు.

కృష్ణనగర్ ప్రాంతం నేతల సందర్శన

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : యూసుఫ్ గూడ డివిజన్ శ్రీకృష్ణ నగర్ లో జలదిగ్బంధమై ప్రాంతాన్ని, డ్రైనేజ్ తో పొంగిపొర్లుతున్న వీధులని స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, హుడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రజలు పడుతున్న అవస్థలను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పాదయాత్రలో యూసుఫ్ గూడా కాంగ్రెస్ అధ్యక్షుడు ఫెరోజ్ ఖాన్, మాజీ కార్పొరేటర్ సంజయ్ గౌడ్, స్టీఫెన్ మనోజ్ ఇంకా కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సురవరంకు ఘన నివాళి

విశాలాంధ్ర, మేడిపల్లి: ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఉప్పల్ డిపో వద్ద సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి మంగళవారం ఉదయం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి మరణం భారత కమ్యూనిస్ట్ పార్టీకి తీరనిలోటు, వారి విద్యార్థి రాజకీయజీవితం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)తో ప్రారంభించి, జాతీయ ప్రధాన కార్యదర్శిగా, గల్లీ నుంచి ఢిల్లీ వరకు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు కొనసాగించారు. అనేక ఉద్యమాలు చేపట్టి సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారు. రెండు సార్లు ఎంపీగా పనిచేసారు. అనంతరం భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేసి అనేక ప్రజా ఉద్యమాలు చేయడం జరిగింది. రైతు ఉద్యమాలు, గిరిజన ఉద్యమాలు, సామాజిక ఉద్యమాలు, నిర్వర్తించి నీతి, నిజాయితీతో, నిస్వార్థంగా తన జీవితాన్ని గడిపారు. వారి జీవితం నేటి విద్యార్థి, యువతకు ఒక ఆదర్శంగా నిలుస్తుందని, వారి ఆశయాలను, పోరాటతత్వాన్ని కొనసాగిస్తామని పుట్ట లక్ష్మణ్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు కృష్ణ, శ్రీను, వెంకట్, రాము, నవీన్, సాయి, తేజ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : మట్టి గణపతి విగ్రహాలను పూజిద్దామని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. మంగళవారం షేక్ పెట్‌లోని వివేకానంద కాలనీలో షేక్ పేట్ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో వినాయక చతుర్ధతి సందర్భంగా ఫ్రీ ఈకో ఫ్రెండ్లీ గణేష్ ఐడియల్స్ (మట్టి విగ్రహాలు) పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు కాలుష్య ప్రభావాలు, సరస్సులు కాపాడుకోవడం, మన భవిష్యత్తును కాపాడుకోవడం అలాగే పర్యావరణ పరిరక్షణపై జిల్లాలో అవగాహన కార్యక్రమాలు ఎక్కువగా చేపట్టి మార్పు తీసుకువచ్చే లక్ష్యాన్ని వివరించారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని మట్టితో చేయబడిన ప్రతిమాలను వినియోగించాలని అన్నారు. అదేవిధంగా జిహెచ్ఎంసి ద్వారా ఒక లక్ష, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా లక్ష అలాగే హెచ్ఎండిఏ ద్వారా లక్ష విగ్రహాలను అందించనున్నట్లు వివరించారు. అదేవిధంగా జిల్లాలోని 40కు పైగా బీసీ సొసైటీలలో కుమ్మరిలు, శాలివాహనుల ఆధ్వర్యంలో జిల్లాలోని రైతు మార్కెట్లలో మట్టి విగ్రహాలను విక్రయం చేయడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.తదుపరి కాలనీలోని రహదారిని, చెరువును ఆమె పరిశీలించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అభివృద్ధి ఫోరం అధ్యక్షులు పూస చరణ్ కుమార్ మాట్లాడుతూ ఏర్పాటుచేసిన ఫోరం ద్వారా ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్‌కి వివరించగా ఈ సందర్భంగా ఆమె అభినందించారు. తదుపరి విద్యార్థులకు, ప్రాంతవాసులకు వినాయక విగ్రహాలను అందచేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి ఆశన్న, కాలుష్య నియంత్రణ బోర్డు ఈ ఈ సురేష్, నిర్వాహకులు, ప్రాంతవాసులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత పిల్లలలో సృజనాత్మకతను వెలికితీస్తుంది :నవనీతరావు

విశాలాంధ్ర , కాప్రా : ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుండి ఆధ్యాత్మికతతో కూడిన క్రమశిక్షణ అలవర్చుకోవాలని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ కె నవనీతరావు సూచించారు. ఆధ్యాత్మికత పిల్లలలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీస్తుందన్నారు. నాచారం డివిజన్, రాఘవేంద్ర నగర్ లోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో పాఠశాలలో వినాయక చవితి వేడుకలను ఘనంగా శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి చైర్మన్ నవనీత రావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కమల మనోహర్ తో కలిసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వినాయకుని మనకు చెడుపై మంచి విజయం అనే సందేశం ఇస్తుందన్నారు. విద్యార్థులు వినాయకుని కథను నాటకంగా ప్రదర్శించి వేషాధారణతో పలువురిని అలరించాయి. చిన్నారుల ప్రదర్శనతో పాఠశాల పండగ వాతావరణం సంతరించుకుంది. పాఠశాల ఆవరణలో వినాయకుని వినాయకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కోర్ హెడ్ ఆపరేషన్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమితి సభ్యుడిగా టీ రామకృష్ణ ఎన్నిక

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మేడ్చల్ జిల్లా గాజులరామారంలో సీపీఐ రాష్ట్ర నాలుగో మహాసభలు ఈ నెల 20, 22 తేదీలలో జరిగాయి. ఆ మహాసభలలో రాష్ట్ర సమితి సభ్యుడిగా టీ. రామకృష్ణ మొదటిసారిగా అవకాశం కల్పించిందని ఆయన తెలిపారు. రంగారెడ్డి జిల్లా సీపీఐ కార్యదర్శి పాలమాకుల జంగన్న, రాష్ట్ర సమితి నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామికి తనకు సహకరించిన వారందరికీ టీ రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని,పర్యావరణానికి హానికరం కాని మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్టించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యూసుఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ సహకారంతో ఏర్పాటు చేసిన మట్టి గణపతులను హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ ముందు ఉచితంగా పంపిణీ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. యూసుఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ మట్టితో చేసిన వినాయకులను ప్రోత్సహించాలని, రసాయనాలతో చేసిన విగ్రహాలు అందంగా కనిపించినా పూజల అనంతరం వాటిని చెరువులు నాళాలలో నిమజ్జనం చేయడం వలన నీరంతా కలుషితమై నీటి రంగు మారడమే కాక తాగడానికి పనికి రావన్నారు. పైగా ఆయా చెరువులు నాళాలలో ఉండే చిన్నజీవులు తాగడానికి ఇబ్బంది పడతాయని ఆయన వివరించారు. పూజలు అందుకున్న మట్టి వినాయక విగ్రహాలను మన ఇంట్లోనే నిమజ్జనం చేసి ఆ నీటిని మొక్కలలో మొక్కల కుండీలలో పోయాలని, తద్వారా పర్యావరణాన్ని కాపాడు కున్న వారం అవుతామని పేర్కొన్నారు. ఇటువంటి విషయాలు పిల్లలకు తెలియజేసి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని వారు అన్నారు. నగరంలో వైభవంగా నిర్వహించుకొనే వినాయక చవితి పండుగ సందర్భంగా అందరూ ఇండ్లలోనూ, అపార్ట్మెంట్స్ కాలనీ, బస్తీల్లో సామూహికంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించాలని పిలుపునిచ్చారు. నగరంలో కాలుష్యం పెరగకుండా అందరూ తమవంతు కృషి చేయాలని కోరారు. మానవ సమాజ మనుగడకే ముప్పుగా పరిణమిస్తున్న కాలుష్యాన్ని నియంత్రించాల్సిన అవసరముందన్నారు. పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ ఖైరతాబాద్ అధ్యక్షుడు కళ్యాణ్, సీపీఐ హైదరాబాద్ జిల్లా నేత చెట్టుకింది శ్రీనివాస్,నేతలు వంశీ, అరుణ్, అశోక్, ప్రతిమ, కీర్తి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి కాలువ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి : మియాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి ఎనక్లేవ్ కాలనీ నుంచి బొల్లారం మెయిన్ రోడ్డు వరకు రూ 1 కోటి 50 లక్షల అంచనావ్యయంతో నూతనంగా నిర్మాణం చేపట్టబోయే వరద నీటి కాలువ నిర్మాణం పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా 1.50 ఒక కోటి యాబై లక్షల రూపాయల నిధులతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులను చేపట్టడం జరిగిందని, ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులు కలిసి సమన్వయంతో పనిచేయాలని, వరద నీటి కాల్వ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడలని, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులలో జాప్యం లేకుండా పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని గాంధీ తెలిపారు. త్వరలో వరద నీటి కాల్వ నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, పనులు త్వరితగతిన చేపట్టాలని, పనులలో వేగవంతం పెంచాలని,పనుల విషయంలో అలసత్వం ప్రదర్శించకూడదని ,పనుల నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అధికారులకు తెలియచేసారు. వరద నీటి కాల్వ నిర్మాణం పనులపై అధికారులకు అనేక సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నో ఏండ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శరత్ రెడ్డి మేనేజర్ సునీత ,ఇంజనీరింగ్ విభాగము అధికారులు ఏఈ సంతోష్, వర్క్? ఇన్స్పెక్టర్ నవీన్ , ఎలక్ట్రికల్ ఏఈ రవిచంద్ర, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరీసా జయంతి

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి : తమతమ రంగాల్లో అంకితభావంతో పనిచేసేవారికి ఎప్పుడూ సముచిత గుర్తింపు లభిస్తుందనీ, అటువంటి వారికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సేవారత్న పురస్కారాల అందించడం ఎంతో ప్రోత్సాహకరమని ముఖ్య అతిథిగా విచ్చేసిన హెచ్‌సియు తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం మాదాపూర్ డివిజన్ పరిధిలో స్వాతి హైస్కూల్‌లో కన్వీనర్ తాడిబోయిన యాదవ్ అధ్యక్షతన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. సమాజంలో మానవసేవే మాధవసేవగా భావించి వివిధ రంగాలలో విశేషమైన సేవలందించిన అయిదుగురు సేవా మూర్తులకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, గౌరవ అతిథిగా హాజరైన రాగం మల్లికార్జున యాదవులు సేవారత్న అవార్డులను (దుశ్శాలువ, జ్ఞాపిక, పగిడి, తాంబూలం) ప్రదానం చేశారు. ఎన్.సుజాత, ఎన్. శ్రీకాంత్, శ్రీ రాంమోహన్ (సత్యసాయి సేవా దళ్ సభ్యులు), డాక్టర్ రఘు అరికపూడి (సామాజికవేత్త), శ్రీ పాటూరి వెంకటేశ్వర్లు (వ్యక్తిత్వ వికాస నిపుణులు, సామాజిక వేత్త) ఈ పురస్కారాల్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పడిన నాటి నుండీ చేస్తున్న అనేక సేవాకార్యక్రమాల్ని చేస్తుంది. ఈ కార్యక్రమంలో రాగం మల్లికార్జున యాదవ్, స్వాతి హైస్కూల్ కరస్పాండెంట్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విఫణి కుమార్ ఎం.బసవ లింగం, సత్యసాయి సేవాసమితి, సభ్యులు డా.రామన్న, బి.వి.కే.రావు, సుబ్బారావు, మూర్తిగారు, జి.వి.రావు, విష్ణు ప్రసాద్, శివరాం కృష్ణ, పాలం శీను, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే సౌరభ్ భరద్వాజ్‌పై ఈడి దాడులు

విశాలాంధ్ర, బషీర్ బాగ్: ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ అధ్యక్షులు సౌరవ్ భరద్వాజ్ పై ఈడి దాడులు ఖండిస్తూ మంగళవారం ఆప్ తెలంగాణ పార్టీ కార్యాలయంలో డాక్టర్ దిడ్డి సుధాకర్ కన్వీనర్ తెలంగాణ, బుర్రా రాములు గౌడ్, విజయ్ మల్లంగి, యమునగౌడ్, హేమ జిల్లోజు, జావీద్ షరీఫ్, శివాజీ, దర్శనం రమేష్, అజీమ్ బైగ్ లతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ సౌరభ్ భరద్వాజ్ పై వచ్చిన ఆరోపణలు, సోదాలు నిరాధారమైనవి, ఎటువంటి ఆధారాలు లేవు. సౌరభరత్వాజ్‌పై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ మోపుతున్న ప్రస్తుత అభియోగం, ఆయన ఆరోగ్య మంత్రిగా లేని కాలానికి సంబంధించినదనీ, శ్రీ సత్యేంద్ర జైన్ ఆ సమయంలో ఢిల్లీ ఆరోగ్య మంత్రిగా ఉన్నారనీ పేర్కొన్నారు. శ్రీ సత్యేంద్ర జైన్ కేసులో, ఆయనను 3 సంవత్సరాలు జైలులో ఉంచిన తర్వాత, సీబీఐ ఆయనకు ఎటువంటి ఆధారాలు లేనందున క్లీన్ చిట్ ఇచ్చిందని మనం ఇప్పటికే చూశామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 5,267 ఈడి, సిబిఐ కేసులు తమ వ్యతిరేకుల మీద మోపి బెదిరించి తన తన పార్టీలో చేర్చుకుంటుందని, ఆప్ పార్టీ నాయకుల ముందు బీజేపీ ఆటలు సాగవని, భవిష్యత్తులో బీజేపీని కేంద్రంలో అధికారం నుంచి దింపేది ఆమ్ ఆద్మీ పార్టీ ఏ అని అన్నారు. అనంతరం బుర్రా రాములు గౌడ్ మాట్లాడుతూ ఇప్పుడు సౌరభ్ భరద్వాజ్ పై ఈడీ దాడులు ఎందుకు జరుగుతున్నాయి అంటే ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడిగా సౌరబ్ భరద్వాజ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఆయన బిజెపి రేఖ గుప్తా ప్రభుత్వానికి నిద్రలేని రాత్రులు ఇస్తున్నారని ఆరోపించారు. విజయ్ మల్లంగి మాట్లాడుతూ సౌరభ్ భరద్వాజ్ ఇంటిపై ఎందుకు దాడి చేస్తున్నారనీ, కారణం, నిన్నటి నుండి నడుస్తున్న వార్తల ముఖ్యాంశాలను మార్చడానికి ప్రధాని మోదీ నకిలీ డిగ్రీ వార్తల నుండి ప్రజలను మళ్లించడానికే అన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం : మేయర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : గణేష్ చతుర్థిని పర్యావరణ హితంగా జరుపుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం బంజారాహిల్స్ మేయర్ క్యాంప్ కార్యాలయంలో డెప్యూటీ కమిషనర్ సమ్మయ్యతో కలిసి స్థానికులు, విద్యార్థులకు మేయర్ మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. మట్టి గణపతే... మహా గణపతి అని... మట్టి గణపతులను ప్రతిష్టించి ,పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు.

సైక్లింగ్ ర్యాలీకి రాష్ట్ర గవర్నర్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 31, ఆదివారం నిర్వహించబడుతున్న సైక్లింగ్ ర్యాలీ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ మేరకు తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవిలు మంగళవారం రాజ్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వానించారు. "ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమం భాగంగా ఈ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు గవర్నర్‌కు వివరించారు. ఆగస్టు 31 ఉదయం 7 గంటలకు గచ్చిబౌలి స్టేడియం మెయిన్ గేట్ వద్ద సైక్లింగ్ ర్యాలీ ప్రారంభం కానుంది. గవర్నర్ ఈ ఆహ్వానాన్ని సానుకూలంగా స్వీకరించి, తప్పకుండా హాజరవుతానని తెలిపారు.

విద్యుద్ఘాతంతో ఆవు మృతి

విశాలాంధ్ర-మొయినాబాద్: కరెంటు షాక్‌తో ఆవు మృతి చెందిన సంఘటన తోల్కట్ట గ్రామ సమీపాన చోటుచేసుకుంది మంగళవారము మండల పరిధిలోని తోల్కట్ట గ్రామానికి చెందిన మక్బూల్ అనే రైతు రోజు మాదిరిగానే తన ఆవులను మేత మేయడానికి గ్రామ సమీపంలో గడ్డి వేయడానికి తోలుకెళ్లాడు గ్రామ సమీపంలో గల హైదరాబాద్ వ్యక్తి వాళ్ళ పక్కన కరెంటు వైర్ దారి పొడవున వేయడంతో ఆవు మేగమేయడానికి వెళ్లి కరెంటు షాక్‌తో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఆ రైతు మక్బుల్ లబో దీపం అంటూ ఆవేదన వ్యక్తం. మృతి చెందిన ఆవు రోజుకు ఐదు లీటర్ల పాలు ఇస్తుండేదని. ఆవు విలువ రూ. 90000 అన్నారు. దీంతో గ్రామస్తులు మాజీ సర్పంచ్ కనకమామిడి శ్రీనివాస్, గ్రామ ప్రజలు అక్కడికి చేరుకొని బాధితుడిని ఓదారుస్తూ న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలుపుతూ ఓదార్చారు. బాధితుడు మబ్బులకు ఫామ్ హౌస్ యజమాని నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ డిమాండ్ చేస్తున్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం

విశాలాంధ్ర - మొయినా బాద్: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడు కుందామని మండల అభివృద్ధి అధికారిణి సంధ్యారాణి అన్నారు. బుధవారం వినాయక చవితిని పురస్కరించుకొని జోగన్పల్లి ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు మట్టి గణవతుల పంపిణీ కార్యక్రమాన్ని ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల హౌజింగ్ ఏఈ సుష్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి : మియాపూర్ క్యాస్టల్ టౌన్ పాఠశాలలో మంగళవారం స్కూల్ విద్యార్థులకు హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మట్టి వినాయకులను ప్రతి ఒక్కరూ పూజించాలని హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సర్వస్వతి శ్రీదేవి, స్కూల్స్ సీఈఓ మురళి శంకర్ తో పాటు సింగదాసరి రాజశేఖర్ స్థానికులు మహేందర్ ముదిరాజ్ , రామచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : వినాయక చవితి పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించి ఆ విఘ్నేశ్వరుడు ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని ప్రార్థించారు. ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజించాలని, వాతావరణ కాలుష్యం కాకుండా మట్టి వినాయకులకు ప్రాముఖ్యతను ఇవ్వాలని తెలిపారు. దీనివల్ల వాతావరణ సమతుల్యంతో పాటు, వినాయకులను నిమజ్జనం చేసే చెరువులు కలుషితం కాకుండా ఉంటాయని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన వినాయక విగ్రహాలను వాడడం వల్ల అన్ని రకాలుగా హానికరమని అన్నారు. ప్రజలందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ నవరాత్రులు జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ మరొక్కమారు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

సబ్ రిజిస్టర్ ఆఫీస్ తరలించవద్దని వినతి

విశాలాంధ్ర -తుర్కయంజల్ : ఇబ్రహీంపట్నం నియోజ కవర్గ కేంద్రంలో నియోజకవర్గ ప్రజలకు జూన్ 1 1969 నుంచి అందుబాటులో ఉన్న సబ్ రిజిస్టర్ ఆఫీస్‌ను మహేశ్వరం నియోజకవర్గం లోని మంఖాల్‌కు తరలించేందుకు తీసుకున్న ప్రభుత్వ నిర్ణయం ప్రజలకు అసౌకర్యం కలిగిస్తుందని, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన తీసుకొస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో నిర్మాణం మొదలుపెట్టిన భవనాన్ని పూర్తి చేయకుండా ఉన్న కార్యాలయాలను నియోజకవర్గం నుండి తరలిస్తే నియోజకవర్గ అభివృద్ధి ఆగిపోవడమే కాకుండా ఉపాధి అవకాశాలు కోల్పోతామని కలెక్టర్ కి సవివరంగా తెలిపి ఈ నిర్ణయాన్ని తక్షణమే ఆపాలని కోరామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి రోడ్డుకు నిధులు మంజూరు

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని పరిగి రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.5.50 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ...షాద్ నగర్ పట్టణ చౌరస్తా నుంచి కిషన్ నగర్ రోడ్డు వరకు ఉన్న రహదారి బాగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వాహనాల రద్దీ పెరిగి ఇరకాటంగా మారిందని, అదేవిధంగా లీకేజీలతో, భారీ వాహనాలతో గుంతలు పడి అత్యంత అధ్వానంగా తయారైందని అన్నారు. దీనిని బాగు చేసే నిమిత్తం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ నిధులను మంజూరు చేసినట్లు వివరించారు. త్వరలోనే రహదారి పనులను ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. అదేవిధంగా షాద్ నగర్ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణకు కూడా వ్యాపారంతో మాట్లాడుతున్నామని అది కూడా త్వరలోనే తేలుస్తామని వెల్లడించారు. పరిగి రోడ్డును పునరుద్ధరించడంతోపాటు మధ్యలో అడుగడుగున ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాశీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని ఎస్ పి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి కోరారు.మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని చిత్తారమ్మ దేవి నగర్ లో శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ లో ఎస్ పి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున చైర్మన్,ఫౌండర్ సొంటి రెడ్డి పున్నా రెడ్డి విద్యార్థులకు మట్టి గణపతి లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సొంటి రెడ్డి పున్నా రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యతని,మనమందరం మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేయాలని విద్యార్థులకు సూచించారు.మట్టి విగ్రహాలను పెట్టడం వల్ల వాటి తయారీ లో ఎటువంటి రసాయనాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి హానికరమైనవి లేనందువల్ల పర్యావరణానికి మనమెంతో మేలు చేసిన వారం అవుతామని తెలిపారు. జల కాలుష్యం నుండి పశువులను,పక్షులను కాపాడిన వారమవుతామని బోధించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీమతి చైతన్య రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్,ఆలయ ధర్మకర్త ఆగం రాజు ముదిరాజ్ వినాయక చవితిని పురస్కరించుకొని మంగళవారం శ్రీ వెంకట శివ రామాలయం నందు ఆయన చేతుల మీదుగా ప్రజలకి మట్టి గణపతి విగ్రహాలను ఉచిత పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు చేయాలి

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి : భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతిని కలిసి ఖాజాగూడలో పెద్ద చెరువు వద్ద సుందరికరుణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ ఒక కోనేరు నిర్మించి గణేష్, బతుకమ్మ వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులువినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు కైతాపురం జితేందర్, నక్క శివ కుమార్, కైలా రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లు కేంద్రం అడ్డుకుంటుంది : జాజుల

విశాలాంధ్ర, బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం పెంచకుండా కేంద్ర ప్రభుత్వమే అడుగడుగునా అడ్డుకుంటుందని, రాష్ట్రపతి భవన్‌ను, గవర్నర్ భవన్‌ను బీజేపీ ప్రభుత్వం తమ జేబు సంస్థగా మార్చుకుంటుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కేంద్రంపై ఆరోపణలు గుప్పించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ బీసీకుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో తాము చేసిన పోరాటం ఫలితంగా తెలంగాణ ప్రభుత్వం బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించి ఐదు నెలలు అవుతున్నప్పటికీ నేటి వరకు ఆ బిల్లును ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పెంపును అడుగడుగున అడ్డుకుంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతికి, బీసీల ఆర్డినెన్స్ ను గవర్నర్ కు రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రపతి భవన్‌ను, రాజభవన్ తమ జేబు సంస్థల వాడుకుంటుందని, రాజ్యాంగ బద్ధమైనటువంటి రాష్ట్రపతి, గవర్నర్‌లను స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం తమ రాజకీయ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మోక్షం కల్పించకుండా బిజెపి తన బీసీ వ్యతిరేక వైఖరితో అడ్డుకుంటుందన్నారు. నాటి మండల్ నుండి నేటి బిసి బిల్లు వరకు బిజెపి బీసీలను మోసం చేస్తూనే ఉందన్నారు. ఈనెల 28న హైదరాబాద్‌లో బీసీ సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మీడియా సమావేశంలో కుల్కచర్ల శ్రీనివాసు ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాంకుర్మ, ఉప్పరి శేఖర్ సగర, గొడుగు మహేష్ యాదవ్, ఈడిగి శ్రీనివాస్ గౌడ్, గూడూరు భాస్కర్ మేరు, అనిల్, జాజుల భాస్కర్ గౌడ్, మధు పాల్గొన్నారు.

పత్తికి సీ2+50 శాతం ఎంఎస్‌పీ

- దిగుమతి సుంకాల రద్దుపై నోటిఫికేషన్ ఉపసంహరణ
- ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.25లక్షలు
- సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతాంగానికి హామీనిచ్చే విధంగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించాలని, పత్తిపై దిగుమతి సుంకాలు రద్దు చేసే నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌కేఎం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. పత్తిపై దిగుమతి సుంకం రద్దు చేస్తే 60 లక్షల పత్తి రైతు కుటుంబాలు జీవనోపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ చర్య దేశీయ పత్తి ఉత్పత్తిని తీవ్రంగా దెబ్బతీస్తుందని, ఇప్పటికే పత్తి ధర పడిపోతోందని, రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు పోరాడాలని, దానిని మరింత ఉధృతం చేయాలని రైతులకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చినట్లు ప్రకటన వెల్లడించింది. అలాగే, వ్యవసాయానికి, రైతుల సంక్షేమానికి విఘాతం కలిగించే స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) వద్దని పేర్కొంది. దిగుమతి సుంకాల రద్దును తక్షణమే డీ నోటిఫై చేయాలని, పత్తికి ఎంఎస్‌పీ సీ2 + 50 శాతం కల్పించాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.25 పరిహారం ఇవ్వాలని ఎస్‌కేఎం డిమాండ్ చేసింది. పత్తి రైతుల్లో ఆత్మహత్యలు పెరిగాయని, సెప్టెంబరు 17, 18 తేదీల్లో మహారాష్ట్రలోని విదర్భాలో ఎస్‌కేఎం బృందం పర్యటిస్తుందని రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య వెల్లడించారు. పత్తిపై 11 శాతం దిగుమతి సుంకం రద్దు కోసం ఈనెల 19న ఇచ్చిన నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. ఇందుకోసం తీర్మానించేందుకు సెప్టెంబరు 1,2,3 తేదీల్లో పత్తి సాగు చేసే గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తీర్మానాన్ని ప్రధానికి పంపుతామని చెప్పారు. ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రతులకు నిప్పు పెట్టి గ్రామీణ స్థాయిలో నిరసనలు తెలపాలని రైతులకు పిలుపునిచ్చారు. పత్తికి సీ2+50 శాతం ఎంఎస్‌పీ... క్వింటా ధర రూ.10,075గా ప్రకటించాలని రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో గ్రామ సభలు ఏర్పాటు చేసి తీర్మానించేందుకు గ్రామస్థాయి బహిరంగ సభల ఏర్పాటుకు స్థానిక సంఘాల తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. సెప్టెంబరు 10 నాటికి ఆయా స్థానిక సంఘాల అధ్యక్షులకు వినతిపత్రాల అందజేతకు మద్దతుగా సంతకాల సేకరణ, ఇంటింటికి కరపత్రాల పంపిణీ వంటివి చేపట్టనున్నట్లు వెల్లడించారు. తమ డిమాండ్‌పై ప్రధాని తక్షణమే చర్యలు తీసుకోకపోతే పత్తి రైతులు మండల్ పంచాయత్‌లు నిర్వహిస్తారని, పార్లమెంటు సభ్యులను చేరుకునేందుకు నిరసన ప్రదర్శనలు చేపడతారని క్షీరసాగర్, రావుల వెంకయ్య హెచ్చరించారు. ఇందుకోసం తేదీని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర సమన్వయ కమిటీలు త్వరలో నిర్ణయిస్తాయన్నారు. పత్తి సాగు చేసే 11 రాష్ట్రాల్లో సభలు నిర్వహించి, పత్తి రైతులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ఈ కమిటీలు నిర్ణయిస్తాయని క్షీరసాగర్, వెంకయ్య వెల్లడించారు.

ట్రంప్ సుంకాలు నేటి నుంచి అమలు

ప్రభావం... తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాని సమీక్ష

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. భారత్ నుంచి జరిగే ఎగుమతులపై 50 శాతం సుంకాలను ట్రంప్ సర్కారు వసూలు చేయనుంది. తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్... రష్యా నుంచి చమురు కొనుగోళ్లను సాకుగా చూపి మరో 25 శాతం సుంకాలు విధించారు. ఇందుకోసం ఎగ్జిటీవ్ ఆర్డర్‌పై ఈనెల 6న ఆయన సంతకం చేశారు. భారత్ వస్తువులపై కొత్త సుంకాలు 27వ తేదీ అర్ధరాత్రి 12.01 గంటల నుంచి అమల్లోకి వస్తాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ద్వారా హోమ్‌లాండ్ ఆఫ్ సెక్యూరిటీ విడుదల చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఈ సుంకాల ప్రభావం, ఎగుమతిదారుల కోసం తీసుకునే చర్యలను ప్రధాని మోదీ మంగళవారం సమీక్షించారు. ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రధాని ప్రిన్సిపల్ కార్యదర్శి అధ్యక్షతన వాణిజ్య-పరిశ్రమల శాఖతో సహా సంబంధిత ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపారు. అమెరికా విధించిన 50 శాతం సుంకాలు అమలుతో భారత్‌లో వ్యవసాయం, ఫార్మా, జౌళి, చర్మ ఉత్పత్తులపై ప్రభావం పడుతందని నిపుణులు ఇప్పటికే హెచ్చరించారు. ఈ క్రమంలో ఎగుమతులపైనే ఆధారపడిన పరిశ్రమలు, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎస్ఎంఈలు)లపైనే ప్రధానంగా దృష్టి సారించాలని ప్రభుత్వ వ్యూహమని అధికారులు తెలిపారు. ఎగుమతిదారులకు ఎలాంటి భరోసా కల్పించాలో సంబంధిత అధికారులతో ప్రధాని చర్చించారు.

డ్యామ్‌ల నుంచి నీరు విడుదలపై భారత్ హెచ్చరిక

- లక్షల మందిని తరలించిన పాకిస్థాన్
- రావి, సట్లెజ్, చీనాబ్ నదులకు పొంగిపొర్లుతున్న వరద
- వందలాది గ్రామాలు ఖాళీ

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: భారత్ నుంచి వెలువడిన కీలక హెచ్చరికతో పాకిస్థాన్‌లో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ డ్యామ్‌ల నుంచి అదనపు జలాలను విడుదల చేయనున్నట్లు భారత్ ప్రకటించడంతో, పాకిస్థాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందుజాగ్రత్త చర్యగా, దేశ వ్యవసాయానికి గుండెకాయ లాంటి పంజాబ్ ప్రావిన్స్‌లోని మూడు నదుల పరీవాహక ప్రాంతాల నుంచి ఏకంగా 1,50,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. భారత్, పాకిస్థాన్ దేశాలు గత కొన్ని వారాలుగా కుండపోత వర్షాలు, వరదలతో అతలాకుతలమవుతున్నాయి. ఈ క్రమంలో, భారత పంజాబ్‌లోని డ్యామ్‌లు ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో మిగులు జలాలను నదుల్లోకి వదిలేందుకు సిద్ధమైనట్లు సోమవారం భారత్ తమకు సమాచారం ఇచ్చిందని పాకిస్థాన్ అధికారులు తెలిపారు. ఈ నీరు పాకిస్థాన్‌లోకి ప్రవహించే రావి, సట్లెజ్, చీనాబ్ నదులలో కలవనుండటంతో వరద ముప్పు పొంచివుంది. ఈ నేపథ్యంలో, పాకిస్థాన్ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. ఈ మూడు నదుల తీరంలో ఉన్న వందలాది గ్రామాలను ఖాళీ చేయించి, ప్రజలను సురక్షిత శిబిరాలకు తరలిస్తున్నట్లు పాక్ విపత్తు నిర్వహణ అధికారి మజార్ హుస్సేన్ వెల్లడించారు. రానున్న రోజుల్లో భారత్ నుంచి నియంత్రిత పద్ధతిలో నీటి విడుదల ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, భారీ వర్షాల కారణంగా పాకిస్థాన్‌కు దౌత్య మార్గాల ద్వారా హెచ్చరికలు జారీ చేసినట్లు భారత ప్రభుత్వ వర్గాలు ధృవీకరించాయి. వర్షాలు కొనసాగితే మరిన్ని హెచ్చరికలు జారీ చేసే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్న తరుణంలో, ఈ వరద పరిణామాలు సంబంధాలపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

సంజయ్‌కు 9 వరకు రిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఐపీఎస్ అధికారి సంజయ్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు సెప్టెంబరు 9 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. నాలుగు వారాల్లో లొంగిపోవాలని సంజయ్‌ను గతంలో సుప్రీం కోర్టు ఆదేశించింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో మంగళవారం ఆయన ఏసీబీ కోర్టులో లొంగిపోయారు. అగ్నిమాపక, సీఐడీ డీజీగా ఉన్నప్పుడు సంజయ్ అవకతవకలకు పాల్పడ్డారంటూ నమోదయిన కేసుపై న్యాయస్థానం ఆదేశాలిచ్చింది.

సునీల్‌కుమార్ సస్పెన్షన్ ఫిబ్రవరి 24 వరకు పొడిగింపు

ఐపీఎస్ అధికారిగా ఉన్న పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను వచ్చే ఏడాది ఫిబ్రవరి 24 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న అభియోగాలు నిరూపణ కావడంతో ఆయనపై ప్రభుత్వం వేటు వేసింది. రెండు రోజుల్లో సస్పెన్షన్ గడువు ముగియనుండటంతో రివ్యూ కమిటీ సమీక్ష నిర్వహించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంపై సునీల్ కుమార్‌పై ఏసీబీ విచారణ కొనసాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజును వేధించారనే ఆరోపణల కేసులోనూ గుంటూరు నగరపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్ష్యాధారాలు, దర్యాప్తును ప్రభావితం చేస్తారని రివ్యూ కమిటీ వేసింది. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున సస్పెన్షన్ పొడిగించాలని ప్రతిపాదించింది. ఈ క్రమంలో తదుపరి చర్యలు తీసుకోవాలని డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ సీఎస్ విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల తేదీల నిర్ణయం బీజేపీదే

రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణ

మధుబని (బీహార్) : ఎన్నికల్లో ఓట్ల చోరీకి పాల్పడి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ఎన్నికల సంఘం అధికార బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని మరోసారి ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వాటి తేదీని ఎన్నికల కమిషన్‌కు బదులుగా బీజేపీ నిర్ణయిస్తోందని తీవ్ర ఆరోపణ చేశారు. ఓట్ల చోరీపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఒక్కమాట కూడా మాట్లాడట్లేదని ప్రశ్నించారు. 'ఓటరు అధికార యాత్ర'లో భాగంగా బీహార్‌లో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ మంగళవారం మధుబనిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం మరో 40 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని అమిత్ షా అన్నారని, ఆ విషయం ఆయనకు ఎలా తెలుసని రాహుల్ ప్రశ్నించారు. ఓట్ల చోరీకి పాల్పడితే ఎన్నేళ్లయినా అధికారంలో ఉండవచ్చని ఎద్దేవా చేశారు. కొన్నేళ్ల క్రితం గుజరాత్ ఎన్నికల్లో మొదలైన ఈ ఓట్ల చోరీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం వరకు వచ్చిందని అన్నారు. ప్రతి రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కచ్చితంగా ఎన్నికల తేదీలను మారుస్తారని ఆరోపించారు. వీటి గురించి ఎవరూ ప్రశ్నించకుండా, ఎన్ని అక్రమాలు జరిగినా ఎన్నికల కమిషన్‌పై కేసు నమోదు చేయకుండా చట్టం తీసుకొచ్చారని అన్నారు. మహారాష్ట్ర, కర్నాటక, మణిపూర్ లాంటి రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ కొత్త ఓటర్లు వచ్చారో అక్కడ బీజేపీ విజయం సాధించిందని చెప్పారు. ఎన్నికల కమిషన్ అధికారులు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని రాహుల్ సూచించారు. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై ఎప్పటికైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీహార్ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు ఇండియా ఐక్య సంఘటన ఎంత దూరమైనా వెళుతుందోని అన్నారు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని ఎప్పుడూ గౌరవించలేదని, అది రాజ్యాంగ విలువలకు వ్యతిరేకమని అన్నారు. ఇప్పుడు మనం ఓటు హక్కును కోల్పోతే రాజ్యాంగాన్ని ఎన్నటికీ రక్షించుకోలేమని చెప్పారు.

బాబు, జగన్ వినాయక చవితి శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వినాయక చవితి సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేస్తూ.. మీ కుటుంబ ప్రగతికి, మీ లక్ష్యాలకు ఎలాంటి విఘ్నాలు కలుగకుండా ఆ గణపతి మిమ్మల్ని అనుగ్రహించాలని కోరుకుంటున్నాను. వాడవాడలా మండపాలు నెలకొల్పి భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో గణేశుని పూజిస్తున్న ప్రజలకు సకల శుభాలు కలుగజేయాలని ఆ వినాయకుని ప్రార్థిస్తున్నాను అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ గణనాథుని ఆశీస్సులు ఉండాలని, క్షేమ, స్థైర్య, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మంచి పనులకు విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ సకల శుభాలూ కలగాలని, విజయాలు సిద్ధించాలని.. ఇంకా గణనాథుని కరుణా కటాక్షాలతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధి చెందాలని ఎక్స్ వేదికగా జగన్ అభిలషించారు.

ఆపరేషన్ సిందూర్ ముగియలేదు

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- ఉదయగిరి, హిమగిరి యుద్ధ నౌకలు జాతికి అంకితం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కొత్తగా తయారు చేసిన యుద్ధ నౌకలు 'ఉదయగిరి (ఎఫ్35)... హిమగిరి (ఎఫ్34) ని మంగళవారం స్థానిక నావెల్ డాక్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ నౌకలను డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థల్లో అత్యాధునిక సాంకేతికతో తయారు చేశారు. దేశంలోని వేర్వేరు షిప్ యార్డులలో నిర్మించిన రెండు ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ యుద్ధ నౌకలను ఒకేసారి జాతికి అంకితం చేయడం ఇదే ప్రథమం. బ్లూ వాటర్ పరిస్థితుల్లో రక్షణ బాధ్యతలను నిర్వర్తించే సామర్థ్యం ఈ నౌకల సొంతంగా రూపొందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి మాట్లాడుతూ ఈ రెండు నౌకలు బహుళ పాత్రలు పోషించనున్నాయని, స్వదేశీ యుద్ధ నౌక సామర్థ్యానికి ప్రతీక అని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు ఇవి నిదర్శనమని, సాంకేతిక పరిజ్ఞానం ఈ నౌకల తయారీలో ప్రతిబింబిస్తోందని చెప్పారు. 2050 నాటికి 200 యుద్ధ నౌకలు నిర్మాణం చేస్తామన్నారు. అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమైన నీలగిరి క్లాస్లో కీలకమైన ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి యుద్ధ నౌకలు భారత రక్షణ శాఖ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ... మంగళవారం నౌకాదళ అమ్ములపొదిలో చేరాయి. అత్యాధునిక ప్రాజెక్ట్-17లో భాగంగా మల్టీ-మిషన్ స్టెల్త్ ఫ్రిగేట్లుగా రూపుదిద్దుకున్న వీటిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ త్రిపాఠీ జాతికి అంకితం చేశారు. ముంబైలోని మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో ఉదయగిరి, కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ) లో హిమగిరి యుద్ధ నౌకలు నిర్మించారు. ఆధునిక కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ (సీవోడీవోజీ) ప్రొపల్షన్ ప్లాంట్లు, అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థతో పాటు దేశీయ సాంకేతికతతో అభివృద్ధి చేసిన అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్ల సూట్స్ ఉన్న ఈ నౌకలకు సముద్ర జలాల్లో నిర్దేశిత లక్ష్యాలను నూరు శాతం పూర్తిచేయగల సామర్థ్యం ఉంది. హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటా సముద్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు, దేశ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ముఖ్య భూమిక పోషించనున్నాయి. 75 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ యుద్ధ నౌకలు అనేక రికార్డులను సొంతం చేసుకున్నాయని నావికాదళ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు నావికాదళ అధికారి రాజేష్ పెందర్కర్, ఎంపీ సీఎం రమేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలు, న్యాయం కోసం పోరు

ఉపరాష్ట్రపతి ఎన్నికపై అఖిలేశ్: జస్టిస్ సుదర్శన్ రెడ్డితో ఎస్పీ అధినేత భేటీ

లక్నో: ఉప రాష్ట్రపతి ఎన్నిక రాజ్యాంగ విలువల పరిరక్షణ, న్యాయం కోసం జరిగే పోరాటమని, అధికారం కోసం జరిగేది కాదని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ వక్కాణించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపుపై ధీమా వ్యక్తంచేశారు. అఖిలేశ్ మంగళవారం తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డితో భేటీ అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జస్టిస్ సదర్శన్ రెడ్డి కేరీర్ మొత్తం రాజ్యాంగం, చట్టం, ప్రజల హక్కుల పరిరక్షణ విధులతో సాగిందని, ప్రస్తుత పరిస్థితుల్లో అత్యున్నత పదవి కోసం ఆయన కంటే సమర్థులు లేరన్నారు. న్యాయాన్ని గౌరవించే వారంతా తమ మనసాక్షితో ఓటేసి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి చారిత్రక గెలుపును అందజేస్తారన్న నమ్మకం ఉందని అఖిలేశ్ చెప్పారు. ఉప రాష్ట్రపతి కార్యాలయాన్ని ఓ భావజాలానికి పరిమితం చేసే ప్రయత్నాన్ని బీజేపీ చేస్తోందని, ఇది దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన చర్య అని విమర్శించారు. గెలుపోటములు కాదు సిద్ధాంతాలు ముఖ్యమని నొక్కిచెప్పారు. పార్టీ రాజకీయాలను పక్కన పెట్టి రాజ్యాంగ విలువులకు కట్టుబడే అభ్యర్థిని ఎంపిక చేయడంలో ప్రతిపక్షం ఒక్కటిగా వ్యవహరించిందన్నారు. ప్రత్యామ్నాయం చూపే రాజ్యాంగ బద్ధ హక్కును వాడుతున్నామన్నారు. అత్యున్నత రాజ్యాంగబద్ధ పదవైన ఉప రాష్ట్రపతి హోదా కోసం ఎన్నికలు రాజకీయాలకు అంతీతంగా జరగాలని అఖిలేశ్ యాదవ్ అన్నారు.

ఏడు నగరాల్లో 'స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్'

విశాలాంధ్ర-సచివాలయం: పట్టణాల్లో జీవనోపాధులను బలోపేతం చేయడం, పట్టణాలకు చైతన్యం తీసుకురావడం దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అనంతపురం, కర్నూలు, తాడేపల్లి-మంగళగిరి, ఒంగోలు, శ్రీకాకుళం, విజయవాడ, వైఎస్ఆర్ కడపలో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. పట్టణ ప్రాంతాల పేదరిక నిర్మూలన మిషన్ అధ్వర్యంలో డే-ఎన్‌యూఎల్ఎం పరిధిలోని సపోర్ట్ టు అర్బన్ స్ట్రీట్ వెండర్స్ పథకం ద్వారా అమలు కానుంది. దీని ప్రధాన ఉద్దేశం వీధి వ్యాపారులను సక్రమంగా, ఆధునికంగా ఏర్పాటు చేయడం, గౌరవప్రదమైన జీవనోపాధిని కల్పించడం, పట్టణాల పరిపాలనను శ్రద్ధగా స్థిరంగా మలచడమని పట్టణ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. 'వీధి వ్యాపారం అనేది పట్టణాల అనధికార ఆర్థిక వ్యవస్థలో కీలకమని, వేలాది కుటుంబాల జీవనోపాధిని ఆధారపర్చడమే కాకుండా, రోజు లక్షలాది మంది పౌరుల అవసరాలను తీర్చుతుంది. నియంత్రణలేని వ్యాపారం ట్రాఫిక్ రద్దీకి, అసురక్షిత పరిస్థితులకు దారితీస్తుంది. వ్యాపారులకు గౌరవం దూరమవుతుంది. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ల ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక నూతన విధానాన్ని ప్రారంభిస్తోంది. ఇది వ్యాపారులకు గౌరవం, వినియోగదారులకు సౌకర్యం, పట్టణాలకు శ్రేణి క్రమాన్ని అందిస్తుంది. ఒక్కో పట్టణంలో 40 నుంచి 200 వరకు దుకాణాల సామర్థ్యం గల మాడ్యూలర్ కంటెయినర్ మార్కెట్లు ఏర్పాటు చేస్తారు. ఏడు పట్టణాల్లో మొత్తం 580 దుకాణాలు ఏర్పాటవుతాయి. మాడ్యూలర్ డిజైన్ ద్వారా 40 నుంచి 200 వరకు దుకాణాల ఆవశ్యకత ఉంటుంది' అని ఎస్ సురేష్ కుమార్ వెల్లడించారు.

ముంబైలో రియల్ ఎస్టేట్ జోరు

- ఇళ్ల ధరలకు రెక్కలు..
- ప్రపంచంలోనే టాప్ మార్కెట్‌గా గుర్తింపు
- బ్రిటన్ సంస్థ సావిల్స్ నివేదిక వెల్లడి

ముంబై: ప్రపంచవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ మార్కెట్లు మందగిస్తున్నప్పటికీ, భారతదేశ ఆర్థిక రాజధాని ముంబై మాత్రం దూసుకుపోతోంది. 2025 మొదటి అర్ధభాగంలో ఇక్కడి ప్రైమ్ రెసిడెన్షియల్ మార్కెట్‌లో ఇళ్ల ధరలు 2 నుంచి 3.9 శాతం వరకు పెరిగాయి. దీంతో ప్రపంచంలోని అగ్రశ్రేణి నివాస మార్కెట్లలో ఒకటిగా ముంబై తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. ఈ కీలక విషయాలను యూకేకు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సేవల సంస్థ 'సావిల్స్' విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా స్థూల ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ముంబైలోని విలాసవంతమైన గృహాలకు స్వదేశీ, విదేశీ కొనుగోలుదారుల నుంచి డిమాండ్ స్థిరంగా కొనసాగుతోందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా సంపన్న భారతీయులు, స్వదేశానికి తిరిగి వస్తున్న ఎన్నారైల నుంచి బలమైన కొనుగోలు ఆసక్తి కనిపిస్తోంది. దీనికి తోడు నగరంలో జరుగుతున్న భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, కొత్త ప్రాజెక్టుల సరఫరా పరిమితంగా ఉండటం ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి.

"ప్రస్తుతం జరుగుతున్న భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పరిమితంగా ఉన్న కొత్త సరఫరా కారణంగా ధరలు నిలకడగా పెరుగుతాయని మేము ఆశిస్తున్నాం. దీనివల్ల ముంబైకి ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు లభిస్తుంది" అని సావిల్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్ నందన్ తెలిపారు. అద్దెల మార్కెట్ విషయానికొస్తే, కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, దౌత్య కార్యాలయాల నుంచి డిమాండ్ గణనీయంగా పెరిగింది. రాబోయే ఆరు నెలల్లో అద్దెలు మరో 2 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. ఇతర పశ్చిమ, ఆసియా దేశాలతో పోలిస్తే, ఎన్నారైలకు గృహ రుణాల కోసం అవసరమైన డిపాజిట్లు (15 నుంచి 25 శాతం) తక్కువగా ఉండటం కూడా భారత మార్కెట్‌కు కలిసొస్తున్న అంశమని నివేదిక పేర్కొంది. 2024లో 2.2 శాతంగా ఉన్న ప్రపంచ రియల్ ఎస్టేట్ మార్కెట్ వృద్ధి, 2025 ప్రథమార్థంలో 0.7 శాతానికి పడిపోయింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ ముంబై మార్కెట్ సానుకూల వృద్ధిని నమోదు చేయడం విశేషం.

బీహార్ 'ఓట్ల చోరీ' విమర్శలపై ప్రజాభిప్రాయం: ఈసీ వర్గాలు

న్యూఢిల్లీ: కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సర్కారు ఎన్నికల సంఘం తో కుమ్మక్కై బీహార్ ప్రజల ఓట్లను దొంగిలించే ప్రయత్నాలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న క్రమంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము చేపట్టిన బీహార్ ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కు సంబంధించిన వివిధ అంశాలపై తమ అభిప్రాయం తెలపాలని రాష్ట్ర ప్రజలను కోరేందుకు పోల్‌ప్యానల్ ఐదు ప్రశ్నలను సిద్ధం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అవి: ఓటర్ల జాబితాలను సవరించి, విస్తృతంగా పరిశీలించాలా? చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలా? రెండు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల పేర్లను ఒకదగ్గరి నుంచి తొలగించాలా? ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన ఓటర్లను జాబితా నుంచి మినహాయించాలా? విదేశీయులు, ఇతర రాష్ట్రాల ప్రజల ఓటు హక్కును తిరస్కరించాలా? ఈ ప్రశ్నల ఆధారంగా బీహార్ వ్యాప్తంగా సర్వే చేసి ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడానికి ఎన్నికల కమిషన్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

రేవంత్ రెడ్డిని బీహారీలు తరిమికొడతారు

ప్రశాంత్ కిశోర్



పట్నా: జన్ సూరజ్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అసలు రేవంత్ రెడ్డి ఎవరని, బీహార్‌లో ఆయనకు ఏం పని అని ప్రశ్నించారు. ఆయన బీహార్‌లో ఎక్కడికి వెళ్లినా అక్కడి ప్రజలు కర్రలతో తరిమి కొడతారని అన్నారు. బీహార్ రాజకీయాల్లో రేవంత్ జోక్యాన్ని ప్రశాంత్ కిశోర్ తప్పుపట్టారు. 'అసలు రేవంత్ రెడ్డి ఎవరు? బీహార్‌లో ఆయనకు ఏం పని? బీహార్‌తో రేవంత్ రెడ్డికి ఉన్న సంబంధం ఏమిటి? రేవంత్ రెడ్డి స్థాయి ఏమిటి? అని ప్రశాంత్ కిశోర్ ప్రశ్నల వర్షం కురిపించారు. రేవంత్ రెడ్డి ఒకవైపు బీహార్ ప్రజలను అవమానించేలా మాట్లాడుతూ మరోవైపు అదే బీహార్‌కు ఓట్లు అడగడానికి ఎలా వస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్‌ను అవమానించే నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని, ఇది రాహుల్ గాంధీ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఓట్ల చోరీ అంటూ రాహుల్‌గాంధీ ప్రధాని మోదీని విమర్శిస్తున్నారని, తప్పుడు ఆరోపణలు అంటూ మోదీ... రాహుల్‌గాంధీని విమర్శిస్తున్నారని, అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ నాటకాలని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.